ధాన్యలక్ష్మి అలంకరణలో.. కనకమ్మ



అమ్మవారికి నివేదించిన లడ్డూలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు శనివారం ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లడ్డూలను నివేదించారు. నగరానికి చెందిన పి.జగదీప్, లక్ష్మి దంపతులు లడ్డూలకు అవసరమైన రూ.75 వేలు విరాళంగా అందజేశారు. పూజల్లో ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు తిరుపతిరావు, కె.పద్మజ పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, వన్‌టౌన్

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు కాపు/ తెలగ అవివాహిత వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి కాపు/తెలగ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (ఆదివారం, అక్టోబరు 6న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **91549 18858, 80080 01686** ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను ఇక్కడ తెలిపిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు. – న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

ఇంటి అద్దె చెల్లింపునకు డిమాండ్ | 14లో

గ్రాండ్ మాస్టర్ దిశగా అడుగులు..!

రెండేళ్ల యూరప్ పర్యటన ఎన్నో నేర్పింది..



అంతర్జాతీయ చదరంగ క్రీడాకారిణి సాహితీ వర్షిణి

అంతర్జాతీయ చదరంగం పోటీల్లో నగరానికి చెందిన వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ (డబ్ల్యూఐఎం) **మూగి సాహితీ వర్షిణి** సంచనాలు సృష్టిస్తోంది. చదరంగం బోర్డుపై మెరుపులు మెరిపిస్తున్న ఆమె ఆటలో మరింత రాటుదేలేందుకు రెండేళ్ల పాటు యూరప్‌లో పర్యటించింది. అక్కడ పలు టోర్నీల్లో ఆడి విజయాలు సాధించింది. ఇప్పటికే నాలుగు ఫిడే టైటిళ్లు, తొమ్మిది అంతర్జాతీయ పతకాలు సాధించింది. వెరసి వుమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించేందుకు అవకాశాలు మెరుగు పరచుకుంటోంది. యూరప్ పర్యటన ముగించుకుని ఇటీవల నగరానికి వచ్చిన ఆమె అక్కడ ఎదుర్కొన్న సవాళ్లు, ఇబ్బందులు, భవిష్యత్ లక్ష్యాలు.. తదితర అంశాలను 'న్యూస్‌టుడే'తో పంచుకుంది.

● 'యూరప్ పర్యటనలో చాలా మంది గ్రాండ్ మాస్టర్లతో పోటీ పడ్డా. వారిలో కొందరిపై విజయం సాధించడం ద్వారా నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. తద్వారా నా రేటింగ్ కూడా మెరుగు పడింది. విజయమైనా, ఓటమినైనా ఒకే విధంగా స్వీకరించాలని అక్కడ తెలుసుకున్నా. ఆ అనుభవం భవిష్యత్‌లో మరిన్ని వేదికలపై రాణించేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నా.

హేమాహేమీలతో తలపడ్డా..: నేను మాగ్నస్ చెస్ ఛాలెంజ్ టోర్నీలో ప్రపంచ పిన్న వయస్కుడైన గ్రాండ్‌మాస్టర్ అభిమన్యు మిశ్రా (అమెరికా)ను, ఐస్‌ల్యాండ్‌లో జరిగిన రెక్యావిక్ టోర్నీలో ప్రముఖ చెస్ రచయిత, గ్రాండ్‌మాస్టర్ సైమన్ విలియమ్స్‌ను, ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ పోటీల్లో గ్రాండ్‌మాస్టర్, మాజీ ప్రపంచ ఛాంపియన్ మేరియా ముజీచుక్ (ఉక్రెయిన్)ను ఓడించా. ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో 13వ స్థానంలో నిలిచా. అక్కడ ఒక పాయింటు తేడాతో టాప్‌త్రీ స్థానాలను కోల్పోయా.

విజయం వెనుక నాన్న: నా కోసం నాన్న లోకేష్ చాలా త్యాగం చేశారు. ఉద్యోగం వదిలేసి నా భవిష్యత్తుకు తపిస్తున్నారు. నాన్న శిక్షణ వల్లే నేను నాలుగు ఫిడే టైటిళ్లు, తొమ్మిది అంతర్జాతీయ పతకాలు సాధించా. 2022లో చెస్ ఒలింపియాడ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించా. నాన్న శిక్షణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించారు. ఓటమి సమయంలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లకుండా ఎప్పటికప్పుడు ధైర్యం నింపేవారు. టోర్నీల ప్రణాళిక, వాటికేం కావాలి..ఇలా ప్రతిది దగ్గరుండి చూసుకున్నారు. నా విజయాల వెనుక ఉన్నది నాన్నే.

> 'ప్రతి టోర్నీకి ముందు కొత్త వ్యూహాలను అనుసరించడం కష్టం. అయితే యూరప్‌లో దాన్ని బాగా అమలు చేశా.
>
> 2022లో కొవిడ్ రావడంతో అబుదాబిలో టోర్నీ ఆడలేకపోయా. అక్కడే క్వారంటైన్‌లో ఉండడం చాలా ఇబ్బందికి గురిచేసింది.
>
> ముఖ్యంగా విదేశీ పర్యటనల్లో ఆర్థిక పరిమితుల కారణంగా పలు ముఖ్య టోర్నమెంట్లు కోల్పోవాల్సి వచ్చింది'.

న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు

అత్యున్నత స్థాయికి చేరుకోవడమే లక్ష్యం: వుమెన్ గ్రాండ్‌మాస్టరు టైటిల్ రావాలంటే రేటింగ్ 2300 ఉండాలి. ప్రస్తుతం 2309 రేటింగ్ కలిగి ఉన్నా. కానీ ఇంకా మూడు నార్మ్‌లు సాధించాల్సిన అవసరం ఉంది. వాటిపై దృష్టి కేంద్రీకరించా. వాటిని సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తా. నా లక్ష్యం చదరంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవడం. దృఢ సంకల్పం, కృషి, సరైన సన్నద్ధత ఉంటే ఏదైనా సాధ్యమేనని నమ్ముతా. నా దృష్టి ఎప్పుడూ దానిపైనే కేంద్రీకృతమై ఉంటుంది'.

8నుంచి విశాఖలో 'మలబార్' విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే : భారత నౌకాదళానికి చెందిన తూర్పు నౌకాదళం ముఖ్య కేంద్రమైన విశాఖపట్నం తీరంలో ఈనెల 8న 'మలబార్ మారిటైం' విన్యాసాలు ప్రారంభమవుతాయని శనివారం నేవీ వర్గాలు తెలిపాయి. సీ-ఫేజ్, హార్బర్ ఫేజ్‌లో జరిగే విన్యాసాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నాయి. భారత్‌తో పాటు, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు భాగస్వామ్యమవుతున్న విన్యాసాలు 18 వరకు కొనసాగుతాయని వెల్లడించాయి. హిందూ మహాసముద్రం, ఇండో- పసిఫిక్ సముద్ర ప్రాంతాల్లో మారిటైం సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు బహుళపక్ష మారిటైం విన్యాసాలు దోహదపడతాయని స్పష్టం చేశాయి. అమెరికాకు చెందిన 'యూఎస్ఎస్ డివే', జపాన్‌కు చెందిన 'జేఎస్ ఆరియకె' ఆస్ట్రేలియాకు చెందిన 'హెచ్ఎంఏఎస్ స్టార్ట్' నౌకలు పాల్గొంటున్నాయి. తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అధ్యక్షతన ఆయా దేశాల ప్రతినిధులతో ఉమ్మడి మీడియా సమావేశం ఉంటుందని వివరించాయి.

పూర్తయిన వెసల్ రీఫిట్ పనులు



● సాగరంలో కోస్టుగార్డు వెసల్

సింధియా, న్యూస్‌టుడే : భారతీయ తీరగస్తీ దళానికి చెందిన ఓపీ వెసల్‌కు నిర్ణీత గడువు కంటే ముందుగానే హిందుస్థాన్ షిప్‌యార్డులో రీఫిట్ పనులు పూర్తి చేసినట్టు శనివారం షిప్‌యార్డు యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. సంస్థలోని రిపేర్ కాంప్లెక్స్‌లో సీఎన్‌సీ యంత్ర సాయంతో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి షాఫ్ట్ తొలగించకుండానే బేరింగ్, సీల్స్ వేసినట్టు స్పష్టం చేశాయి. వెసల్‌కు మొత్తం 85 రకాల విడిభాగాలు బిగించినట్టు వెల్లడించాయి.

ఆర్డీవో శ్రీలేఖ బాధ్యతలు స్వీకరణ



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు మొక్కను బహూకరిస్తున్న ఆర్డీవో పి.శ్రీలేఖ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ ఆర్డీవోగా పి.శ్రీలేఖ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన హుస్సేన్ సాహెబ్‌ను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసింది. గ్రూపు-1 అధికారిణి అయిన శ్రీలేఖను విశాఖ ఆర్డీఓగా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆమె ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ విభాగంలో పని చేశారు. గతంలో ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం ఆర్డీవోగా కూడా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అప్పన్న సన్నిధిలో వైభవంగా నృసింహ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి ఆవిర్భావ తార స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సింహగిరిపై నృసింహ హోమం వైభవోపేతంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ నేతృత్వంలో అర్చకులు సుదర్శనమూర్తిని ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. యజ్ఞ గుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. వేదమంత్రాలు, నృసింహ మూలమంత్ర సహిత హోమం నిర్వహించారు. యజ్ఞ ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించి పూర్ణాహుతి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అర్చకులు పుణ్యాహవాచనం జలాల కలశంతో ఆలయ బేడామండపం ప్రదక్షిణం చేసి అంతరాలయంలో స్వామికి సమర్పించారు. పవిత్ర జలాలను భక్తులపై ప్రోక్షణ చేశారు. ఈవో వేంద్ర త్రినాధరావు, భక్తులు హోమగుండం ప్రదక్షిణ చేశారు.



పవిత్ర జలాలతో ప్రదక్షిణ చేస్తున్న ఈవో త్రినాధరావు, అర్చకులు, భక్తులు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో వీఎంఆర్డీఏ, జీవీఎంసీ కమిషనర్లు కె.ఎస్.విశ్వనాథన్, సంపత్‌కుమార్

2029 నాటికి విశాఖ రూపురేఖలు మారాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: సమ్మిళిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేస్తూ స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికను రూపొందిస్తున్నామని, దీనిలో భాగంగా 2029 నాటికి విశాఖ రూపురేఖలు మారేలా కొత్త ఆవిష్కరణలు చేయాల్సి ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. విజన్ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సేవా సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాల సభ్యులు, పారిశ్రామిక వేత్తల నుంచి ఆయన అభిప్రాయాలు సేకరించారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, సాంకేతికతను మరింతగా పెంపొందించుకోవాలని పలువురు సూచించారు. రాబోయే ఐదేళ్లలో వినూత్న ప్రాజెక్టులు చేపట్టాలని, విద్య, యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించాలని, వ్యవసాయ రంగంలో ఆధునిక విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో విశాఖ వాటా 9.15 శాతం ఉందని, దీన్ని 15 శాతానికి పెంచేలా సమిష్టి కృషి జరగాలన్నారు. ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలు, మౌలిక వసతులు, ప్రజారోగ్యం, సంక్షేమ రంగాల్లో ఉత్తమ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సమావేశంలో జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు సంపత్‌కుమార్, కె.ఎస్.విశ్వనాథన్, సీపీఓ శ్రీనివాసరావు, క్రెడాయ్, ఫిక్కీ, ఆర్‌ఐఎన్‌ఎల్, వీసెజ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలలపై ప్రయాణం.. అమ్మవారి దర్శనం..!



కొండపై అమ్మవారి ఆలయం



– న్యూస్‌టుడే, మల్కాపురం

దసరా నేపథ్యంలో పారిశ్రామిక ప్రాంతం సాగరగిరి కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులు సముద్రంపై ప్రయాణించొచ్చు. రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పోర్టు జెట్టీ వద్ద బోట్లు అందుబాటులో ఉంటున్నాయి.

అటు సాగరం... ఇటు నగరం

'సాగరగిరి కనకదుర్గమ్మ' ఆలయంలో దసరా ఉత్సవాలు

ఏళ్ల కిందట విశాఖ పోర్టుకు సంబంధించిన అభివృద్ధి పనులు జరుగుతున్న వేళ... ఓ గుత్తేదారుకు సముద్రంలో దొరికిన అమ్మవారి విగ్రహాన్ని సాగరం ఒడ్డున దట్టమైన అడవితో నిండిన కొండపై ప్రతిష్ఠించారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయంతో పాటు, దుర్గామల్లేశ్వరస్వామి, దుర్గ గణపతి, కామేశ్వరీ దేవి ఆలయాలు, నవగ్రహ విగ్రహాలు భక్తుల పూజలు అందుకుంటున్నాయి.

దేవాలయం చుట్టూ ఉన్న విశాలమైన పచ్చని కొండలు భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దేవాలయ ప్రాంగణంలోనూ ఉద్యానవనాన్ని తీర్చిదిద్ది, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. కొండపై పూజారి యింట్ల వద్ద భక్తులు స్వీయచిత్రాలు తీసుకుంటూ ఆనందంగా గడుపుతుంటారు. కొండపై నుంచి చూస్తే ఓ వైపు సముద్రం, మరో వైపు విశాఖ నగరం అందంగా కనిపిస్తుంటాయి.

ఉత్సవాలు ఇలా..

శరన్నవరాత్రుల తొమ్మిది రోజులూ ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభిస్తారు. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. రోజూ సాయంత్రం ఆరు గంటల తర్వాత సప్త నేత్ర హారతి (ఏడు రకాల హారతులు) ఇవ్వడం ఆనవాయితీ. 'దశమి' తర్వాత ఏకాదశి రోజున విశాఖ పోర్టు ఉద్యోగులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బోటుపై సముద్రంలోకి తీసుకెళ్లి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఇలా వెళ్లొచ్చు..!

హిందుస్థాన్ షిప్‌యార్డు సమీప కొండపై ఉన్న ఆలయంలో నిత్యం పూజలు జరుగుతుంటాయి. సాధారణ రోజుల్లో నగరానికి చెందిన భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్లాలంటే... షిప్‌యార్డు సమీపంలోకి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.

★ గాజువాక నుంచి వెళ్లే భక్తులు సింధియా కూడలికి చేరుకుని, అక్కడి నుంచి హిందుస్థాన్ షిప్‌యార్డు వెనుక ఉన్న ఆలయానికి సొంత వాహనాల్లో గాని, ఆటోల్లో గాని వెళ్లే అవకాశం ఉంటుంది.

★ దసరా ఉత్సవాల తొమ్మిది రోజులు మాత్రం సాగరంలో బోట్లపై ప్రయాణించే వీలుంటుంది. భక్తులు ఎవరైనా వాహనాల్లో పాతపోస్టాఫీసు కూడలికి చేరుకోవాలి. అక్కడ పోర్టు వెంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన పోర్టు జెట్టీ నుంచి బోట్లు ద్వారా సముద్రం మీదుగా ప్రయాణించి అమ్మవారి ఆలయం కొండ వద్దకు చేరుకోవచ్చు. బోటు దిగిన తర్వాత ఉచిత ఆటోలో కొండపై ఆలయానికి వెళ్లొచ్చు.



సముద్రంలో బోటుపై ఆలయానికి వెళ్తున్న భక్తులు

పర్యాటకాభివృద్ధికి రాష్ట్రంలో త్వరలో గోల్ఫ్ కోర్సు

రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్రీడాభివృద్ధిలో భాగంగా అమరావతిలో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం ఈస్ట్ పాయింట్ గోల్ఫ్‌క్లబ్ ఆధ్వర్యంలో వైజాగ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ విజేతలకు బహుమతుల ప్రదానంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషిచేయాలన్నారు. క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలన్నారు. అనంతరం టోర్నమెంట్ విజేత అంగద్ చీమా, ద్వితీయ విజేత అమాండ్ అర్జ్‌లను మంత్రి అభినందించి నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని నిర్వాహకులు సన్మానించారు. ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా సి.ఈ.ఓ. ఉత్తమ్ సింగ్, డైరెక్టర్ వికాస్ సింగ్, క్లబ్ ప్రతినిధులు రాజా, రామకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

విశాఖలో బిగ్ భారత్ లీగ్ పోటీలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో డిసెంబరులో జరిగే బిగ్ భారత్ క్రికెట్ లీగ్ పోటీల లోగోను రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెదేపా జాతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. బీబీఎల్‌లో ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేటు సెక్టార్ సంబంధించిన వంద జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు పూర్తిగా ఐపీఎల్ తరహాలో జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని మ్యాచ్‌లు విశాఖలోనే జరుగుతాయని చెప్పారు. ఏపీలోని అన్ని సెక్టార్లలో ఉన్న వారంతా ఇందులో పాల్గొనాలని కోరారు.



లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

సెల్‌పాయింట్‌లో రజతోత్సవం, దసరా ఆఫర్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల రిటైలర్ సెల్‌పాయింట్ ఇండియా లిమిటెడ్ రజతోత్సవం, దసరా పండుగ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. లక్కీడ్రాలో మోటార్‌బైకులు, మొబైల్‌ఫోన్లు బహుమతులుగా గెలుచుకోవచ్చని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్‌ప్రసాద్ పాండే తెలిపారు. డెబిట్‌కార్డు, ఈఎంఐ, క్రెడిట్ కార్డు ఈఎంఐలతో సహా వడ్డీలేని సులభమైన పద్ధతిలో చెల్లించే సదుపాయం కల్పించారు. ఒప్పో ఎఫ్ 27 5జీ సిరీస్, రెనో 12ప్రో 5 జీ కొనుగోలుపై రూ.10వేల వరకు పొందే అవకాశం, కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై రూ.20వేల వరకు తగ్గింపు, భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10శాతం వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ సదుపాయం, అప్‌గ్రేడ్ మార్పిడి చేయడం ద్వారా రూ.20వేల వరకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. శ్యామ్‌సంగ్, ఎంఐ, ఎల్‌జీ, సోని, వర్ల్‌పూల్, హయర్, ఏస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై 50 శాతం వరకు తగ్గింపు, అన్ని బ్రాండ్ల యాక్సెసరీస్‌పై 60శాతం తగ్గింపు పొందవచ్చని తెలిపారు. సెల్‌పాయింట్ అన్ని రిటైల్ అవుట్‌లెట్స్‌లో, ఆన్‌లైన్ వేదికపై ఆఫర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

మాధవస్వామి ఆలయంలో దొంగతనం కేసు ఛేదన



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

మాధవధార, న్యూస్‌టుడే: ప్రఖ్యాతిగాంచిన సింహాచలం ఉపదేవాలయం మాధవధారలో కొలువై ఉన్న మాధవస్వామి ఆలయంలో ఆగస్టు నెలలో జరిగిన దొంగతనం కేసును ఎట్టకేలకు విశాఖ నగరం కంచరపాలెం క్రైం పోలీసులు ఛేదించారు. ఆలయంలో చోరీకి పాల్పడ్డ నిందితులు శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం ఎల్.ఎన్.పేటకు చెందినవారిగా గుర్తించినట్లు క్రైం ఏసీపీ మోహన్‌రావు తెలిపారు. ఈమేరకు కంచరపాలెం క్రైం పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైం ఏసీపీ వెంకట్రావు వివరాలు వెల్లడించారు. మాధవస్వామి ఆలయంలో జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి నిందితులను శ్రీకాకుళం జిల్లాకు చెందినవారిగా గుర్తించామని, ఆ దిశగా అక్కడ పోలీసులకు తెలియజేయడంతో వారి కదలికలపై శ్రీకాకుళం పోలీసులు, కంచరపాలెం క్రైం పోలీసులు సంయుక్తంగా నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. కంచరపాలెం క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావు సిబ్బందితో అక్కడకు వెళ్లి వారి వివరాలు సేకరించారన్నారు. చోరీకి సంబంధించి శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేటకు చెందిన సవర భోగేష్ (26), సవర తిరుపతి (30), కుర్మాన శ్రీనివాసరావు (21) తో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన బత్తిన శ్రీకాంత్ (25)లను గుర్తించి వారి నుంచి 30 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన కంచరపాలెం క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావు బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

★ **సాంకేతిక పరిజ్ఞానంతో ఆలయాల్లో చోరీలు:** కేసులో పట్టుబడ్డ నలుగురు నిందితులు ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 50కి పైగా ఆలయాల్లో భారీ చోరీలకు పాల్పడినట్లు గుర్తించామని క్రైం ఏసీపీ వెంకట్రావు తెలిపారు. ప్రత్యేక ఆలయాలకు సంబంధించి గూగుల్‌సెర్చ్ ద్వారా వివరాలు సేకరించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రెండ్రోజుల పాటు ఆలయ ప్రాంగణాల్లో రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రాంతాలలో నిందితులపై అనేక చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఆలయాల్లో విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడంతో ఇటువంటి నేరాలకు చెక్ పెట్టవచ్చునని సూచించారు.

డాక్టర్ కె.వి.రమణకు ఉత్తమ అంతర్జాతీయ టీచింగ్ ఎక్సలెన్సీ అవార్డు



కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రపంచ టీచర్స్ డే సందర్భంగా ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణకు అంతర్జాతీయ టీచింగ్ ఎక్సలెన్సీ అవార్డు వరించింది. భారత ప్రభుత్వ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్గనైజ్డ్ రీసెర్చ్ (ఐఎస్ఓ రిజిస్టర్డ్ కంపెనీ) ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది. దిల్లీ వేదికగా శనివారం ఆన్‌లైన్‌లో సంస్థ అవార్డును ప్రకటించింది. దేశం మొత్తం మీద రెండొందల మంది అవార్డులకు పోటీపడగా ముప్పై ఎనిమిది మందిని ఎంపిక చేశారు. అందులో డాక్టర్ కె.వి.రమణ ఒకరు కావడం గమనార్హం.

లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగరంలోని వివిధ రైతుబజార్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా రైతులకు కేటాయించారు. జేసీ కె.మయూర్ అశోక్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్కెటింగ్ శాఖ అధికారులు లాటరీ నిర్వహించారు. 673 మంది రైతులు దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరంతా విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలో కూరగాయలు పండిస్తున్నారు. సాయంత్రం పూట నిర్వహించే రైతుబజార్లలో అమ్మకాలు చేపట్టేందుకు వీలుగా 238 మంది రైతులకు దుకాణాలు కేటాయించారు.



జేసీ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో లాటరీ తీస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ జి.రఘురామారావు నివాసంలో ఆమె భార్య జి.శాంతిరావు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. దేవతా మూర్తులు, దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే భిన్న రకాల బొమ్మలను కొలువుదీర్చారు. చుట్టుపక్కల వారంతా వచ్చి ఆసక్తిగా బొమ్మలను తిలకిస్తారని శాంతిరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, వన్‌టౌన్



ఇంటి అద్దె చెల్లింపునకు డిమాండ్

అర్ధరాత్రి వరకు కొనసాగిన ఉక్కు కార్మికుల ఆందోళన

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : ఇంటి అద్దె చెల్లించాలని, పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ... శనివారం ఉక్కు యువ కార్మికులు ఈడీ(వర్క్స్) కార్యాలయాన్ని ముట్టడించారు. షిఫ్ట్ బస్సులను అడ్డుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికుల జీతాల్లో బేసిక్, డీఏ తప్ప ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు కనిపించడం లేదని, పైగా నెల వేతనాన్ని రెండు దఫాలుగా చెల్లిస్తున్నారని ఆరోపించారు. కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో నడపడంలో, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ఆందోళన అర్ధరాత్రి వరకు కొనసాగినా.. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ధర్నాలో పాల్గొన్న ఉక్కు ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం ఉద్యోగిని కె.ప్రతిమ సొమ్మసిల్లి పడిపోవడంతో ఆసుపత్రికి తరలించారు. ఉక్కు కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, పి.వి.రమణమూర్తి, జె.అయోధ్యరామ్, రామస్వామి, జి.నరేంద్ర, ఎన్.సింహాద్రి పాల్గొన్నారు.



రాత్రి 11 గంటల సమయంలోనూ ఈడీ(వర్క్స్) కార్యాలయం వద్దే బైఠాయించిన కార్మికులు

ఒక్క రూపాయే కదా అని ఊరుకోలేదు

వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందిన వినియోగదారుడు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: ఉత్పత్తిదారుడు నిర్ణయించిన అమ్మకం ధర కన్నా ఒక్క రూపాయి అదనంగా వినియోగదారుని నుంచి వసూలు చేయటాన్ని వినియోగదారుల కమిషన్-1 తప్పుపట్టింది. దీంతో అధికంగా వసూలు చేసిన ఒక్క రూపాయిని వాపసు చేస్తూ, రూ.2500 ఖర్చులకుగాను, రూ.పదివేలు నష్టపరిహారంగా వినియోగదారునికి చెల్లించాలని విశాఖ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్-1 తీర్పునిచ్చింది. మద్రిపాలెం ప్రాంతానికి చెందిన వినియోగదారుడు చదరం అప్పారావు వృత్తిరీత్యా న్యాయవాది. చదరం అప్పారావు 2024 ఫిబ్రవరి ఏడున వేపగుంటలోగల రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో జిల్లెట్ రెగ్యులర్ షేవింగ్ క్రీమ్ కొన్నారు. క్రీమ్ ప్యాక్‌పై అమ్మకం ధరను ఉత్పత్తిదారుడు 75 రూపాయలుగా ముద్రించారు. కానీ అమ్మకందారులు, ముద్రించిన అమ్మకం ధర కన్నా ఒక్క రూపాయి ఎక్కువచేసి 76 రూపాయలకు అమ్మారు. అధిక ధరకు విక్రయం విషయమై అడిగినా సమాధానం లేకపోవటంతో వినియోగదారుడు సంస్థ యాజమాన్యానికి ఫిబ్రవరి 22న ఉత్తరం రాసినా బదులు ఇవ్వలేదు. దీంతో మార్చినెల 15న లీగల్ నోటీసు పంపించినా, ప్రయోజనం లేకపోవటంతో వినియోగదారుడు వివాదాల పరిష్కార కమిషన్-1లో ఫిర్యాదు దాఖలుచేశారు. ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన కమిషన్-1 అధ్యక్షురాలు డా.జి.తనూజ, సభ్యులు వర్రి కృష్ణమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

7 నుంచి డిగ్రీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ మొదటి ఏడాది ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థులకు చివరి అవకాశంగా స్పాట్ అడ్మిషన్లు ఈనెల 7 నుంచి 9 వరకు జరుగుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏలలో చేరడానికి ఆన్‌లైన్‌లో సీటురాని, చేరలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

వ్యాపారులు సిండికేటుగా మారి..

మద్యం దుకాణాల్ని దక్కించుకునేందుకు వ్యూహాలు

మాధవధార, న్యూస్‌టుడే: ఐదేళ్ల తర్వాత మళ్లీ ప్రైవేటు వ్యాపారులకే మద్యం దుకాణాలను అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో పోటీపడే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. గత కొన్నేళ్లుగా మద్యం వ్యాపారాలు నిర్వహిస్తున్న కూటమి నాయకుల్లో కొందరు వ్యక్తులు బినామీ పేర్లతో వాటిని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సహకరించాలని ఎమ్మెల్యేలను, ఇటు ఎక్సైజ్ అధికారులను ఒప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పలువురు ముఖ్య నేతలు, వారి బంధువులు, అనుచరులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఎక్సైజ్ అధికారులు సైతం తమకు అనుకూలమైన వారిని రప్పించుకున్నారు. బినామీ పేర్లతో దరఖాస్తులు చేయిస్తున్నారు.

★ **ఆ దుకాణాలకు పోటీ ఎక్కువే:** విశాఖ నగరంలో మద్యం వ్యాపారం ఎక్కడ ఎక్కువగా జరుగుతుందో, రోజువారీ లావాదేవీలు ఎంతెంతో, లాభాల్ని వ్యాపారులు అంచనా వేసుకుంటున్నారు. ముఖ్యమైన ప్రాంతాలు, కూడళ్లలోని దుకాణాల్లో అమ్మకాలు నిత్యం రూ.లక్షల్లో ఉండటంతో వాటి పైనే అధిక శాతం మంది దృష్టి సారిస్తున్నారు. ఆయా చోట్ల కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఒక్కో దుకాణానికి 10 మంది చొప్పున టెండర్ దాఖలు చేయడానికి సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. మరో వైపు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు సిండికేట్లు పార్టీలకు అతీతంగా పావులు కదుపుతున్నారు. పెట్టుబడి పెడతామని, పేరు మాత్రం మీదేనంటూ తెరపైకి వస్తున్నారు. ఖర్చంతా తామే భరించేలా, వచ్చిన ఆదాయాన్ని ఇరు పార్టీల నాయకులు పంచుకునేలా ప్రణాళికలు వేసుకుంటున్నారు. కొంతమంది మద్యం వ్యాపారులు సెంటిమెంట్‌గా భార్యలు, కుమార్తెల పేరుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయిస్తున్నారు. వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం: ఉమ్మడి విశాఖ (విశాఖ, అనకాపల్లి, అల్లూరి) జిల్లాలో వెయ్యికు పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. విశాఖ జిల్లాలో 155 (ఇందులో జీవీఎంసీ పరిధిలో 136, రూరల్‌లో 19), అనకాపల్లి జిల్లాలో 136, అల్లూరి జిల్లాలో 40 మొత్తం 331 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. వీటికి సంబంధించి ఇప్పటికే విశాఖ నగరంలో నాలుగు రోజులకు 150కు పైగా దరఖాస్తులు వచ్చాయి. చివరి రెండు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

విరాగో, బేవాచ్‌లకు జీవీఎంసీ నోటీసులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విరాగో, బేవాచ్ రిసార్ట్‌ల యాజమాన్యానికి మహా విశాఖ నగరపాలక సంస్థ శనివారం నోటీసులు జారీ చేసింది. స్థలానికి సంబంధించి యాజమాన్య హక్కుల పత్రాలు, జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అనుమతులకు విరుద్ధంగా, సీజెడ్‌ఎంఏ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించినట్లు ఆరోపణలు రావడంతో, ఆయా యాజమాన్యాలు వాటిపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. ఈనాడు ప్రధాన సంచికలో గత నెల 29న 'విశాఖ తీరంలో ఉల్లంఘనులు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతోపాటు 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆయా నిర్మాణాలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన జీవీఎంసీ భీమిలి జెడ్సీ ప్రసన్నవాణి ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. వైకాపా హయాంలో సీఆర్‌జెడ్ నిబంధనలు పట్టించుకోకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టినట్లు ఈనాడు కథనంలో పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని సీజెడ్‌ఎంఏ కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని కథనంలో పొందుపరిచారు. విరాగో భీమిలి సమీపంలోని కాపులుప్పాడ గ్రామ పరిధి తిమ్మాపురంలో నిర్మించి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. బే వాచ్ పార్కులోనూ సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు పేర్కొనగా, ఆయా అంశాలపై వివరణ కోరుతూ జీవీఎంసీ అధికారులు నోటీసులిచ్చారు. భవన నిర్మాణ అనుమతులు, యాజమాన్య ధ్రువీకరణపత్రాలు, లింకు డాక్యుమెంట్లు, ఎన్‌కమ్‌బరెన్స్ పత్రం, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుశాఖ, ఏపీసీజెడ్‌ఎంఏ, జీవీఎంసీ అగ్నిమాపక, ఇతర శాఖల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీఎండీ హేమంత్‌ఖత్రీ, తదితరులు

షిప్‌యార్డులో ఓహెచ్‌సీ పునఃప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే : హిందుస్థాన్ షిప్‌యార్డులో ఏళ్ల తరబడి సేవలు అందించిన ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్‌ను (ఓహెచ్‌సీ) శనివారం సంస్థ యాజమాన్యం పునఃప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండస్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ వి.సుజాత హాజరయ్యారు. ఆధునిక వైద్య పరికరాలు, అవసరమైన పడకలు సమకూర్చారు. ఉద్యోగులు, ఒప్పంద కార్మికులకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని యాజమాన్య వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో సంస్థ సీఎండీ కమొడోర్ హేమంత్‌ఖత్రీ, మహిళా క్లబ్ అధ్యక్షురాలు వందనఖత్రీ, ఇతర అధికారులు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పీఎస్సార్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా జాస్తికి 'శక్తి నవరత్న' అవార్డు ప్రదానం



ఆశా జాస్తిని సన్మానిస్తున్న వరల్డ్ ఆఫ్ ఉమెన్ ఫెడరేషన్ ఇండియా ప్రతినిధులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి 'శక్తి నవరత్న' అవార్డు అందుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరల్డ్ ఆఫ్ ఉమెన్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శక్తి నవరత్న పేరుతో అవార్డులను అందించారు. సమాజానికి, మహిళా సాధికారత కోసం కృషిచేస్తున్న వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. విద్యారంగంలో చేసిన కృషికి ఈ అవార్డు అందించినట్లు ఆశా జాస్తి తెలిపారు.

యోగా విజేతలకు సీపీ అభినందనలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆలిండియా పోలీసు రెస్లింగ్ క్లస్టర్-2024లో పతకాలను సాధించిన పోలీసు సిబ్బందిని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అభినందించారు. గత నెల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఈ పోటీల్లో నగరపోలీసు బృందం యోగాలో మూడు కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. పతకాలను సాధించిన మల్కాపురం మహిళా హెడ్‌కానిస్టేబుల్ టి.చిన్నారి, ద్వారకా క్రైమ్ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఎన్.భవానీ, కంచరపాలెం క్రైమ్ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఎ.మల్లీశ్వరిలు పతకాలను గెలుచుకోగా వారిని పోలీసు కమిషనర్ అభినందించారు.



పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

కమనీయం.. సిరి నరసింహుల నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో నిత్య కల్యాణోత్సవం శనివారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

పెందుర్తి

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ బీ-జోన్ పార్కు దరి ఆర్కే ప్లాజా సమీపంలో 24ఎ/1/5 స్తంభానికి ఉన్న వీధి దీపం చాన్నాళ్లుగా వెలగడం లేదు. శివారు ప్రాంతం కావడంతో చీకట్లో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బి.రోహిణి, సుజాతనగర్ బీ-జోన్

సమాధానం: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపానికి త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శివ రామ్‌ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

అ వీ ఇ వీ

● స్కిల్‌హబ్ శిక్షణకు ఆహ్వానం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆవరణలోని స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0లో భాగంగా వెల్డింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఔత్సాహికులు 9014766143 నెంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ ప్రారంభ తేదీ త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

● డిగ్రీలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీతాలక్ష్మి తెలిపారు. బీఏలో 3, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్‌లో 28 సీట్లు, బీఎస్సీ హానర్స్ బోటనీ 15, బీఎస్సీ హానర్స్ కెమిస్ట్రీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈనెల 7 నుంచి 9 వరకు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి చేరవచ్చునన్నారు. అదనపు రుసుముతో రూ.500 చెల్లించి ఈనెల 10 నుంచి 12 సాయంత్రం 5 గంటలలోపు అడ్మిషన్ పొందవచ్చునన్నారు. అభ్యర్థులు అన్ని రకాల ఒరిజినల్ ధ్రువపత్రాలు, జిరాక్సు కాపీలతో కళాశాలకు హాజరుకావాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 9441400060 నెంబరులో సంప్రదించాలన్నారు.

● విద్యార్థులకు ముగిసిన ఇంటర్న్‌షిప్

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణలో భాగంగా దసరా సెలవుల్లో చేపట్టిన మూడు రోజుల ఇంటర్న్‌షిప్ శనివారంతో ముగిసిందని ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి తెలిపారు. విద్యార్థులు పెందుర్తిలోని మారుతీ గ్యారేజీలో నిపుణుల పర్యవేక్షణలో పలు అంశాలపై శిక్షణ పొందారు. రెండవ విడత సంక్రాంతి సెలవుల్లో ఇంటర్న్‌షిప్ ఉంటుందని చిన్నమ్మాయి తెలిపారు. కార్యక్రమంలో వృత్తి విద్య శిక్షకుడు మహేశ్ పాల్గొన్నారు.

● చికిత్స పొందుతూ యువకుడి మృతి


బోర మహేశ్ (పాతచిత్రం)

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు పెందుర్తి సీఐ కేవీ. సతీశ్‌కుమార్ తెలిపారు. భీమిలి దరి పాత పరదేశిపాలెం ప్రాంతానికి చెందిన బోర మహేశ్(21) నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి సరిపల్లి దరి వాటర్ పార్కుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సరిపల్లి పెట్రోల్ బంకు సమీపంలో పెందుర్తి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు గాయమైన మహేశ్‌ను స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

ఆ దారిలో ప్రయాణం.. ఓ సాహసం..!!

లంకెలపాలెం నుంచి సబ్బవరం వరకు ఉన్న రహదారి అత్యంత దారుణంగా తయారైంది. అడుగడుగునా ఉన్న భారీ గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణమంటే సాహసం చేయాల్సిందే. వర్షం కురిస్తే ప్రయాణం వాయిదా వేసుకోవాల్సిందే తప్ప మరో గత్యంతరం లేదు. ఏళ్ల తరబడి పరవాడ, సబ్బవరం మండలాల ప్రజలు ఈ దారిలో వెళ్లలేక నలిగిపోతున్నారు. – ఈనాడు, విశాఖపట్నం





అనుమతి ఉన్నవారే బాణసంచా తయారు చేయాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: ప్రజలు బాణసంచా తయారు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, కేవలం లైసెన్సు ఉన్నవారు మాత్రమే బాణసంచా తయారు చేయాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొగలిపురం, మల్లునాయుడుపాలెం, గంగవరంలోని లైసెన్సులు ఉన్న నాలుగు బాణసంచా తయారీ కేంద్రాలను సందర్శించామన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం వారు బాణసంచా దుకాణాలను నిర్వహిస్తున్నారన్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని చిన్న పిల్లలను ఎవరైనా బాణసంచా తయారీ కేంద్రాల్లో నియమించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది తమ ఇళ్లల్లో ఎటువంటి అనుమతి లేకుండా బాణసంచా తయారీ చేస్తుంటారని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దసరా సెలవుల నేపథ్యంలో తమ ఇళ్లను వదిలి స్వగ్రామాలకు వెళ్లేవారు విలువైన సామగ్రిని తమ వెంట తీసుకెళ్లాలని లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఇచ్చినవారిపై కేసులు పెట్టడం జరుగుతుందన్నారు.

ఎన్ఐటీతో శంకర్ ఫౌండేషన్ ఎంవోయూ


మాట్లాడుతున్న రాధాకృష్ణన్

వేపగుంట, న్యూస్‌టుడే: కృత్రిమ మేధతో కంటి వైద్యపరీక్షల నిర్ధారణకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ముందడుగు వేసిందని ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ తెలిపారు. ఆసుపత్రి అర్ధ సంవత్సర ప్రగతిపై శనివారం ఫౌండేషన్ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధతో గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఐకేర్‌లో నూతన అధ్యాయం సృష్టించడం కోసం ఈ ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలో అత్యధిక శస్త్రచికిత్సలు(4,58,297) జరిపిన ఆసుపత్రిగా శంకర్ ఫౌండేషన్ నిలిచిందన్నారు. సిబ్బంది కృషితో శ్రీకాకుళం, మద్దిలపాలెం, గాజువాక, మధురవాడలో శాఖలు ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని శాఖలు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 15,714 శస్త్రచికిత్సలు చేశామన్నారు. సమావేశంలో ప్రజా సంబంధాల అధికారి బంగార్రాజు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ


డి.శివకృష్ణ ఎంఎస్ఎస్ఎన్ రెడ్డి సీహెచ్ శ్రీనివాసరావు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా సబ్బవరం మండలానికి వచ్చిన వివిధ శాఖల అధికారులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా డి.శివకృష్ణ విధుల్లో చేరారు. ఈయన సబ్బవరం, పరవాడ మండలాలను పర్యవేక్షించనున్నారు. గతంలో చోడవరం, అనకాపల్లి, అచ్యుతాపురం మండలాల్లో పని చేశారు. ఈయన స్వస్థలం ఏలూరు.

★ గృహనిర్మాణ శాఖ ఏఈగా ఎంఎస్ఎస్ఎన్ రెడ్డి విధుల్లో చేరారు. ఈయన పరవాడ నుంచి సబ్బవరం మండలానికి బదిలీపై వచ్చారు. గతంలో జీకేవీధి మండలంలో విధులు నిర్వహించారు.

★ వెలుగు ఏపీఎంగా సీహెచ్ శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన చీడికాడ, పెందుర్తి, డీఆర్‌డీఏ విశాఖలో విధులు నిర్వహించారు. ఈయన స్వగ్రామం పద్మనాభం.

7న మండల సమావేశ మందిరం ప్రారంభం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలాన్ని గతంలో ఉత్తమ మండలంగా గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వం అవార్డు ప్రకటించింది. ఈ మేరకు విడుదలైన నిధులతో మండల సమావేశ మందిరంపై మరో అంతస్తు నిర్మించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నూతన భవనాన్ని సోమవారం ప్రారంభిస్తారని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు.


సుజాతనగర్‌లో అన్నపూర్ణాదేవి



సప్తగిరినగర్‌లో ధైర్యలక్ష్మి


ఎస్ఆర్‌పురంలో గాయత్రీమాత


శ్రమశక్తినగర్‌లో..


నాయుడుతోట ఆలయంలో..


విరాట్‌నగర్‌లో..


పెదతాడి గ్రామంలో..

అన్నపూర్ణే.. సదాపూర్ణే..

నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్య రత్నాకరీ.. అంటూ అశేష భక్తజనం అన్నపూర్ణేశ్వరీ మాతను భక్తిశ్రద్ధలతో కొలిచారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం జగన్మాత అన్నపూర్ణగా పూజలందుకున్నారు. నియోజకవర్గంలోని పలు ఆలయాలు, సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న పూజల్లో భాగంగా సామూహిక కుంకుమార్చనలు సంప్రదాయబద్ధంగా జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొని అమ్మవార్లను ఆరాధించారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


కృష్ణానగర్‌లో..


తాడికాలనీలో..


ధర్మారాయుడుపేటలో..


కాళీ అవతారంలో దేవీపురం రాజరాజేశ్వరీమాత


మణిపురం భువనేశ్వరీ దేవి


పిట్టవానిపాలెంలో..


లంకెలపాలెం కూడలిలో..


చింతలగ్రహారం కృష్ణాలయంలో..


గుల్లేపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న నేతలు


సబ్బవరం దుర్గమాంబ సన్నిధిలో..


ద్వారక జ్యోతిర్లింగ క్షేత్రంలో..


శారదాపీఠంలో పూజలు చేస్తున్న పీఠాధిపతులు

పారిశుద్ధ్య సిబ్బందికి సత్కారం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: ఇటీవల వరదల కారణంగా విజయవాడలో ఇబ్బందుల్లో పడిన ప్రజలకు సేవలు అందించి అధికారుల మన్ననలు పొందిన జీవీఎంసీ 79వ వార్డు పారిశుద్ధ్య సిబ్బందికి శనివారం లంకెలపాలెంలో సత్కారం చేశారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. వరదల్లో తిరుగుతూ సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, కనకేశ్వరరావు, గంగునాయుడు, వెంకటేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సత్కరించిన సిబ్బందితో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, అధికారులు

నిర్లక్ష్యానికి నిదర్శనం

దర్పణం



అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది ఈ విద్యుత్తు స్తంభం. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో మంచినీటి ట్యాంకు పక్కనున్న విద్యుత్తు స్తంభానికి తీగజాతి మొక్కలు భారీగా అల్లుకుపోయాయి. దీనివల్ల వీధి దీపాలు వెలగపోవడమే కాకుండా తరచూ నిప్పురవ్వలు కిందకు రాలుతున్నాయని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో ఇంట్లోని ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది దీనివంక కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తీగజాతి మొక్కలను తొలగించాలని వారంతా కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సబ్బవరం

ఇసుకను అందుబాటులో ఉంచేలా చూడాలి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

పరవాడ, న్యూస్‌టుడే: అందరికీ ఇసుకను అందుబాటులో ఉంచి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని పరవాడలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇసుక దొరక్కపోవడంతో పాటు రేట్లు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తికి గురై వైకాపా ప్రభుత్వాన్ని గద్దె దించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులయినా ఉచితంగా ఇసుక దొరకడం లేదన్నారు. కార్యక్రమంలో వీరునాయుడు, దుర్గారావు, మణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


లక్ష్యను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

పరవాడ, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో ఈనెల 7 నుంచి 10 వరకు నిర్వహించనున్న జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని ముప్ప లక్ష్య ఎంపికైనట్లు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు శనివారం తెలిపారు. శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి అర్హత సాధించిందన్నారు. ఈమేరకు విద్యార్థిని లక్ష్యను ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్, శిక్షకులు శనివారం అభినందించారు. జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పంచముఖ ఆంజనేయస్వామి

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడ సినిమాహాల్ కూడలిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 5వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు జరిపారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో శ్రీనివాసుడు

పరవాడ, న్యూస్‌టుడే: ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ కొండపై కొలువైన వేంకటేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుడిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పండగకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. నవంబరు 7 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రతీ గురువారం న్యూటిన్‌సుఖియా-ఎస్.ఎం.వి.టి బెంగళూరు (05952) ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. నవంబరు 11 నుంచి డిసెంబరు 30 వరకు ఎస్.ఎం.వి.టి బెంగళూరు- న్యూటిన్ సుఖియా (05951) రైలు దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం మీదుగా రాకపోకలు సాగించనున్నట్లు తెలిపారు.

★ విజయవాడ-శ్రీకాకుళం రోడ్డు: ఈనెల 6, 7, 8 తేదీల్లో విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు (07215), 7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళం రోడ్డు- విజయవాడ (07216) ప్రత్యేక రైలును నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ రైలు సేవలను వినియోగించుకోవాలని కోరారు.

రొమ్ము క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే అదుపు చేయొచ్చు


మాట్లాడుతున్న కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద, చిత్రంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ శిల్ప తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రొమ్ము క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే అదుపు చేయవచ్చునని ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప పేర్కొన్నారు. కేజీహెచ్ మెడికల్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసోత్సవాలను శనివారం ప్రారంభించారు. రొమ్ము క్యాన్సర్‌కు దారి తీసే కారకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు అవసరమైన మెమోగ్రఫీ పరీక్షలను కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తామన్నారు. రోజుకు 10 నుంచి 15 మందికి చొప్పున సెలవు దినాలు మినహా మిగిలిన అన్ని రోజుల్లో రానున్న రెండు నెలల పాటు పరీక్షలు నిర్వహించనున్నామని 40 ఏళ్లు దాటిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెయిల్‌లో విలీనమే పరిష్కారం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయకపోతే పోరు తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు హెచ్చరించాయి. శనివారం స్టీల్‌ప్లాంట్ బీసీగేటు వద్ద నిర్వహించిన నిరసనలో పలువురు మాట్లాడారు. కేంద్రం నాన్చుడు ధోరణి వీడి, సెయిల్‌లో విలీనంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండు చేశారు. ఆదివారం నిర్వహించే మానవహారాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. అఖిలపక్ష నాయకులు అనిపెద్ది మసేన్‌రావు, బొడ్డు పైడిరాజు, జెర్రిపోతుల ముత్యాలు, దొమ్మేటి అప్పారావు, జి.గణపతిరెడ్డి, జి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం నిర్వహించే మానవహారాన్ని విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. శనివారం అగనంపూడి పరిధి శనివాడ వేపచెట్టు కూడలిలో ప్రచారం నిర్వహించారు. ఉక్కు కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు శీరంశెట్టి గోవిందరావు, అట్టా అప్పారావు, హరినాథ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


బీసీగేటు వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

EENADU Classifieds

AGRI BUSINESS

ప్రముఖ కంపెనీకి చెందిన శ్రీగంధం, ఎర్రచందనం, మహాగని, టేకు, కొబ్బరి, జామ, సీతాఫలం లభించును. 2 సం॥ సర్వీస్ & రీప్లేస్‌మెంట్. ✆ 81850 37777.

AUTO

VEHICLES FOR SALE

Creta 2016 Model Excellent Single Hand Maintenance Vehicle Fancy Number. Cont: 7013989329.

FOR SALE
BOLERO DIESEL TANKER 2.2 Kl With New 2200 Ltrs Tank, New Preset & Printer Electronic, Digital Diesel Dispenser.
PADMAKAR 9849126923

VEHICLES FOR SALE
SVD ఎంటర్‌ప్రైజెస్, తుని వారి ఫైనాన్స్ సీజింగ్ వాహనములు అమ్మకమునకు సిద్ధంగా కలవు.
✦ TATA 1512, TATA 1815
✦ బడా దోస్త్-4 ✦ TATA ACE-2
✦ BREZZA ✦ BALLENO
✦ CELERIO ✦ ECO
✦ MAGIC EXPRESS
✦ LEYLAND దోస్త్ వాహనములు కలవు.
ఫైనాన్స్ సదుపాయం కలదు.
CONT: 95739 89475

VEHICLES WANTED

Nissan Evalia/ Ashok Leyland Stile Wanted to Buy any Model from Andhra/ Telangana. 9032479793/ 9440971785.

TWO WHEELER

2009 RE Bullet Thunder Bird 350CC For Sale. 35000KM Rs. 70000/- Ravi Ph: 9440615876

BUSINESS SERVICES

Become member in Flat Buyers Association to select best property to your eligibility @ Sagar Nagar. 9177755268.

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్ / ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులో తనఖా ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును మిగిలిన డబ్బు తక్షణమే ఇవ్వబడును. Spot Cash. ✆ 7075086333.

BUSINESS OFFER

Options Trading Business Opportunity. Work & Earn from Home. Online/ Offline Classes at UR Flexible Time Ct: 8885683745.

రెస్టారెంట్ అమ్మకం. పెందుర్తి (వయా అరకు రోడ్)లో మంచి రన్నింగ్ బిజినెస్‌లో ఉన్న మరియు అన్ని రకముల ఎక్విప్‌మెంట్ అమ్మకం. ✆ 7799234582, 9381863550.

RTC కాంప్లెక్స్ దగ్గరలో మంచి రన్నింగ్‌లోగల మెస్ వంట సామాగ్రి, ఫర్నీచర్‌తో సహా అద్దెకు ఇవ్వబడును. Ct: 9246615866.

FOR SALE

Good Running Bakery And Italian Restaurant with Equipment & Staff is for Sale. Kottapalem & Sujathanagar. ✆ 7989611499.

దువ్వాడ రైల్వేస్టేషన్ నుండి సబ్బవరం వెళ్ళే 100 Ft. మెయిన్ రోడ్డు ఫేసింగ్ రెసిడెన్షియల్ ఏరియాలో VUDA ప్లాట్స్ కలవు. ఫోన్ 9989516445.

కూర్మన్నపాలెం నుండి రాజీవ్నగర్ వెళ్ళేరోడ్ ఉడా ఫేజ్ - I ప్రక్కన 30 అడుగుల రోడ్లో 200 చ॥ గ॥లు 36x50 సైజు W/F ఉడా ఎప్రూవల్ స్థలం అమ్మకం ✆ 9912502416.

KAPULUPPADA

Gated Community Sukshetra VUDA Layout Plots 830 Sq, 540 Sq, 459 Sq. (Kapuluppada) Beside Vilasam Villa Project. ✆ 9491911592, 8341055577.

LANKELAPALEM

Aganampudi 400 Sq.Yds. North Face Srinivas Nagar Near Steelplant General Hospital Road, Highway Signal Lights Left Side Road. Cont: 9010595001, 9666905760.

Plot for Sale. Lankelapalem, NH-16, VUDA Plot No: 15, 167 Sq.Yds, Near Ramakrishna Hotel. North Facing. Con: 9393937755.

MADHURAWADA

Excellent VUDA approved 267 Sq.yds. N/F Plot in Lakshmi Narasimha Layout, Devimetta, Madhurawada is for Sale. Contact: 8978533999.

267 Sqyds (40Fx60F) VUDA approved Railway Layout Near MVV-GV-Grand for immediate Sale. Genuine Buyers may Contact: 9347997276.

300 Sq.Yds VUDA Approved Plot for sale. North Facing, SKML Nagar, Nr. RTC Colony, Madhurawada. 8500264614, 9490110278.

P.M.Palem Cricket Stadium Opp. Reliance Show Room Down VUDA Approved 311 Yard Site for Sale. Con: 8179369758.

Pothinamallayyapalem 80Ft Road Facing Commercial Site 524 Yard (Cricket Stadium Opp. 60Ft. Road Facing Commercial Site 128 Yard) Site For Sale. Ph: 7993756689.

Midhilapuri Colony Semi Commercial - 200 Sqy. E/F, Sai Priya Ly - 534 Sqy, Panorama Hills - 167 Sqy., E/F ✆ 8978941242.

Madhurawada- Kommadi, Nr. 80 Ft. Rd. 2850, 420 & 355 S.Yds. 10 VUDA Aprvd. Plots Sale suits for Villas & Apartmnts. Serious Buyers. ✆ 9948564787.

బోయపాలెం హైవేకి దగ్గర్లో నార్త్ ఫేసింగ్ సైజు (30x60) 200 గజాలు వుడా స్థలం అమ్మకం. గజం ధరః 32,000/- సంప్రదించండిః 9177066935, 8367678786.

MVP COLONY

@MVP Colony 289 Sq.yds, Near Ushodaya, Near Appughar & Cance Hospital 600 Sq.yds Near A-1, Grand, 500 Sq.yds SR Puram, Yazar. Cont: 9866770099.

For sale Individual property Visalakshinagar east facing 201.67 sq yds under constructioned. Borewell, Bank loan, 3 Floors GVMC plan, 63053 26363.

MADDILAPALEM

70 Sq.Yds. (11.3x56) South Facing, Between Satyam Jn. & Maddilapalem Jn. Very Good location for Business. Cont.: 9676767788.

NARSIPATNAM

నర్సీపట్నం, శారదానగర్లో చర్చిలైన్ వీధిలో 12 సెంట్లు స్థలం విడివిడిగా గాని ఒకటిగా గాని అమ్మబడును. కాంటాక్ట్ సెల్ 7032815027.

195 గజాలు స్థలం అమ్మబడును. బొంతువీధి, 1 వ వార్డు, 1 బ్లాకు, డోర్నెం: 1-63/1 (ఇంటి ప్రక్క స్థలం) నార్త్ వెస్ట్ కార్నర్ స్థలం, నర్సీపట్నం. Ph: 9849201511.

PENDURTHI

వైజాగ్, పెందుర్తి, ప్రశాంతి నగర్ లో సాయిదివ్య లేఔట్ నందు పడమర ఫేసింగ్, 200 చ॥గ॥ (సైజు : 30x60) ల స్థలము - ప్లాట్ No 149 అమ్మకము. 60 అడుగుల రోడ్డు. ✆ 94947 72687/ 81066 55099.

పెందుర్తి జంక్షన్కి చేరువలో గల రమణగారి ఉడా లేఅవుట్లో 183 గ॥ (30x55) సౌత్ & పెదగాడి జన చైతన్య లే- అవుట్లో 267 గ॥ (40x60) N/E కార్నర్ కలవు. ✆ 9154799799.

వేపగుంటకి 5KM దూరంలో పెదగాడి, పినగాడిలో E,W,N,S ఫేసింగ్స్ గల 100 చ॥గ॥ నుండి ప్లాట్స్ కలవు. ✆ 8328308526.

జనచైతన్య లేఔట్లో పెదగాడి, రాంపురం, పినగాడి ఇల్లు, ఇళ్ల స్థలాలు అమ్మబడును, కొనబడును. వడ్డదిని ఆనుకొని 6 ఎ, దసరా ఆఫర్ 100 గజాలు రూ. 2,50,000/- + ఎలక్ట్రికల్ స్కూటి ఫ్రీ ✆ 6304405253, 7675988238, 7794988238.

SABBAVARAM

సబ్బవరం DSN లా యూనివర్శిటీ దగ్గర VMRDA అప్రూవల్ పొందిన 200 చ॥గ॥ 40 అడుగుల రోడ్ నార్త్ఫేసింగ్ అమ్మకంనకు కలదు. Ph: 9014510345.

SUJATHANAGAR

167 Sq.Yds Plot VUDA Simhapuri Colony 2 layout Simhachalam-Vepagunta Road Call Owner @ 7675858526

267 Sq.Yards South Facing Opp. Park Veeranagar Layout Sujathanagar. Contact: 9393228977

350 చ॥గ॥ సౌత్ ఫేసింగ్ సెమి కమర్షియల్ @ రాంపురం, 220 చ॥గ॥ S/F జనచైతన్య లేఅవుట్, పినగాడి, విశాఖపట్నంలో Plot అమ్మకం. సంప్రదించండి సెల్: 7780230938.

వేపగుంటకు 4KM పెదగాడి గ్రా॥ నందు 97 గ॥ (E) మరియు 220 గ॥ (W) పంచాయితీ 40 అ॥ రోడ్లతో అమ్మకం. Ph: 9828395999.

SIMHACHALAM

N/F 167 & 400 Sq.Yad. VUDA approved in Godavari Township at SR Puram, Vsp. Cont: 9966175303

TAGARAPUVALASA

609 Sq.Yds. N/F 30 Ft. Road Very Near to NH-5 Tagarapuvalasa Behind Amalodbhavi Hotel, Opp. Avanthi Engg. College @ 17,500/- Sq.Yd. 9849877199.

400SqY, N/F, 770SqY, N/E, VUDA Approved & 3865 SqY For Sale Near Tagarapuvalsa walkable To NH16. Mob: 9848426532.

లావణ్య లహరి గ్రూపు వారి సువర్ణ అవకాశం
గవర్నమెంట్ రేటుకే సొంతింటి స్థలం
తగరపువలస దగ్గర దాకమర్రి రెవిన్యూ పరిధిలో VMRDA approved ప్లాట్స్ 90% బ్యాంకు లోన్ సౌకర్యంతో కలవు.
✆ 9177888177

509 sq. yds. (E/F)
NH-16 Facing commercial Vuda Approved PLOT Near Tagarapuvalasa, Visakhapatnam. Contact:
77025 99980
90005 94405

270 Sq.yds. (45x55) East Facing, 33 Feet Road, Vuda LP No. Near Tirumula College @ Tallavalasa. Cost: 16K Per. Sq. ✆ 8121216789.

Rs.11500/- చ॥గ॥ తగరపువలస Okridhge స్కూలు దగ్గర మజ్జివలసలో Villaకి ఎదురుగా 220 చ॥గ॥ అర్జెంటు సేల్. ఫోన్: 7893653636















విద్యార్థుల నృత్యప్రదర్శన

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

మల్కాపురం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు పోటీలు ఉపకరిస్తాయని నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయం-02 ప్రిన్సిపల్ సూర్య ప్రకాశ్ అన్నారు. శనివారం కేవీ-2లో 'ఏక్తా పర్వ్-2024-25' పేరిట క్లస్టర్‌స్థాయిలో కేవీ విద్యార్థులకు నృత్య, సంగీతం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వివిధ జిల్లాల కేవీల నుంచి హాజరైన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించారు. కేవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందిస్తున్న కేవీ-2 ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్

మురళీమోహన్ ఆల్‌రౌండర్

- కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్‌నాయుడు
- మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం అందజేత



మాట్లాడుతున్న సినీనటుడు మురళీమోహన్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటుడు, నిర్మాత, మాజీ ఎంపీ ఎం.మురళీమోహన్ ఆల్‌రౌండర్ అని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ముగింపోత్సవాలు నిర్వహించారు. మురళీమోహన్‌కి డాక్టర్ అక్కినేని స్మారక పురస్కారం అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం అందజేసే అదృష్టం తనకు కలగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో ఇద్దరం పార్లమెంట్‌లో పక్కపక్కనే కూర్చునేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేపోయే వ్యక్తి అన్నారు. ఎన్టీఆర్, ఎ.ఎన్.ఆర్.లతో కలిసిన నటించానని, శోభన్‌బాబుతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశానని, కృష్ణతో కలిసి చదువుకున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జీవీఎల్, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కిన్నెర ఆర్ట్ థియేటర్ అధినేత ఎం.రఘురాం, మాజీమంత్రి దాడి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం అందజేస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, తదితరులు

యువకులను ముగ్గులో దింపి.. ఆపై డబ్బు వసూళ్లు

చివరకు యువతి జైలుపాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: కిలాడీ కిలాడీ... ఓ యువతి. యువకులను ముగ్గులో దింపి అందిన మేరకు డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న ఘటన ఇది. అమెరికాలో పని చేస్తున్న ఒక ఎన్నారై యువకుడిని మాయమాటలతో దగ్గరకు చేర్చుకుని బలవంతంగా నిశ్చితార్థం చేసుకుని పెళ్లి చేసుకోవాలని తీవ్ర ఒత్తిడికి గురి చేసిన ఉదంతంలో విచారణ పోలీసులకు చిక్కింది. ఇందుకు సంబంధించి భీమిలి సి.ఐ. బి.సుధాకర్ శనివారం రాత్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ మురళీనగర్‌కు చెందిన కొండ్రెడ్డి జోయ్ జమీనా (25) అనే యువతి అమెరికాలో ఉంటున్న ఎన్నారై యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. విశాఖలో నివాసముంటున్న యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకుంది. కొన్ని రోజులపాటు మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వీరు నిరాకరించారు. దీంతో ఈమె అమెరికా నుంచి ఆ యువకుడ్ని రప్పించి విమానాశ్రయం నుంచి నేరుగా మురళీనగర్ ఎస్టేట్ కాలనీలో ఉంటున్న తన ఇంటికి తీసుకుపోయింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్లు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకుంది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకరమైన ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరించి వేధింపులకు గురి చేసింది. విశాఖ ఉచ్చు నుంచి ఎలాగైనా తప్పించుకోవాలని ఈనెల 4న బాధితుడు భీమిలి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, ఒక ట్యాబ్, మూడు చరవాణులు, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధమున్న ఆమె అనుచరులపైన సైతం చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

కొట్టి చంపేశారు..!

ఆస్తి గొడవల్లో వ్యక్తి దారుణ హత్య



వాసు (పాతచిత్రం)

సింధియా, న్యూస్‌టుడే: ఆస్తి గొడవలతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురి అయ్యారు. ఈ ఘటనపై శనివారం మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. మల్కాపురానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో ఈనెల 3న మృతి చెందగా, 4న అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి భర్త ఓ బిడ్డ విషయమై అదే రోజు సాయంత్రం ఆమె కుమారుడు దుర్గాప్రసాద్, అల్లుడు గోపి మధ్య వాదులాట జరిగింది. రాత్రివేళ గొడవ తీవ్రమవడంతో దుర్గాప్రసాద్ భార్య దేవి.. దొండపర్తిలో ఉంటున్న బంధువు పవన్‌సాయి, అతని స్నేహితులను రప్పించింది. వారంతా శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గోపితో పాటు అతడి సోదరుడు సారిపల్లి వాసు(46)పై మూకుమ్మడిగా దాడి చేశారు. తీవ్రగాయాలైన వాసును ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడు పవన్‌సాయిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సీఐ ఎస్. విద్యాసాగర్ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – సత్యం సుందరం
రాములమ్మ– దేవర
తాతా – దక్షిణ, సప్తగిరి– స్వాగ్
చేటుమహరాజ్ (ఆనందపురం) – దేవర

ఎలక్ట్రీషియన్, ప్లంబర్ల సంక్షేమ సంఘం ఏర్పాటు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిటౌన్ పరిధిలోని ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల సంఘాన్ని ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో సమస్యల గురించి చర్చించారు. అనంతరం ఈ సంఘ అధ్యక్షునిగా కె.సన్నిబాబు, ఉపాధ్యక్షునిగా జి.వి.అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా కె.వి.రమణ, గౌరవాధ్యక్షునిగా కె.రాఘవ ఎన్నికయ్యారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఎస్.మహేష్, ఎ.సంతోష్, కె.శ్రీను, సి.హెచ్.బాబులు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కర్నూలు ఎంపీ నాగరాజు


ఎంపీ నాగరాజుకు ప్రసాదం అందిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం, న్యూస్‌టుడే: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు శనివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ స్వామివారి ప్రసాదం అందజేశారు.

10న మండల సర్వసభ్య సమావేశం

పద్మనాభం, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

శాశ్వత అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలి

పద్మనాభం, న్యూస్‌టుడే: శేరీఖండంలో శాశ్వత అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామ తెదేపా నాయకుడు వాడపల్లి సురేష్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలి

కొమ్మాది, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ్‌సూతేజ్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకి మేలు చేస్తారనే నమ్మకంతో ఉన్నామని పేర్కొన్నారు. స్టేట్ జాయింట్ సెక్రటరీ బండారు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బి.శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు వెంకన్నపాత్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నారాయణరావు తదితరులు ఉన్నారు.

అవంతిలో దసరా సంబరాలు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస అవంతి ఇంజినీరింగు కళాశాలలో దసరా సంబరాలను శనివారం నిర్వహించారు. అమ్మవారి వేషధారణతో పాటు తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వస్త్రధారణతో విద్యార్థులు అలరించారు. అవంతి విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ ఎంవీఎస్ నందీశ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నరాల వ్యాధులపై అవగాహన

పద్మనాభం, న్యూస్‌టుడే: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పద్మనాభం మండల గ్రామీణ వైద్యులకు శనివారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మధురవాడ విజయ ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.సునీల్‌కుమార్ నరాల సంబంధ వ్యాధులు, ఫిట్సు, పక్షవాతం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యులు సునీల్‌కుమార్

అసంపూర్తి భవనాలు.. అవస్థలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే


భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తికాని అదనపు భవనం

భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైకాపా ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' కింద అదనపు భవనాల నిర్మాణ పనులు చేపట్టారు. వీటికి అరకొర నిధులు కేటాయించడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. భీమిలిలో 1924లో పురపాలక సంఘ హైస్కూలుగా ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాలను.. 1968లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా రూపొందించారు.

★ భవిష్యత్తులో విద్యార్థుల పెరుగుదల సంఖ్యకు అనుగుణంగా ప్రతీ తరగతికి అదనంగా ఏ, బీ పేరిట రెండు క్లాస్ రూమ్‌లను నిర్మించేందుకు 2022లో నాడు-నేడు కింద ఈ పాఠశాలను ఎంపిక చేశారు. ఇందు కోసం రూ. 90 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా.. చివరకు రూ.40 లక్షల నిధులు మాత్రమే విడుదల కావడంతో నిర్మాణాలు సగంలోనే ఆగిపోయాయి. దీంతో వివిధ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

నెలకొన్న సమస్యలు

★ ఎప్పుడో 50 ఏళ్ల క్రితం నిర్మించిన తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ★ చాలా ఏళ్లుగా చిత్రలేఖనం (డ్రాయింగ్) ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉంది. ★ సరైన వసతి లేక మధ్యాహ్న భోజనానికి పిల్లలకు ఇబ్బంది అవుతోంది. ★ గ్రంథాలయానికి వసతి లేక స్టాఫ్‌రూమ్‌లో పుస్తకాలను భద్రపర్చారు. ★ క్రీడాపరికరాలు ఉంచడానికి తగిన వసతి అవసరం. ★ తాగునీటికి అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకును కోరుతున్నారు. ★ మరమ్మతులకు గురైన కంప్యూటర్ల స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలి. ★ ఎప్పుడో వేసిన సున్నాలతో భవనాలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

దాతల తోడ్పాటుతో సంపూర్తి



భీమిలి ప్రభుత్వ హైస్కూల్లో నిలిచిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు దాతలు తోడ్పాటునందించాలి. నాడు-నేడు కింద చేపట్టిన పనులు నిధుల్లేక పూర్తికాలేదు. ఇందు కోసం పూర్వ విద్యార్థులు సైతం ఆర్థికంగా సహకరిస్తే సముచితంగా ఉంటుంది. ఈ భవనాలు పూర్తయితే సమావేశ మందిరం, తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాల, డైనింగ్ హాలు ఏర్పాటుకు అవకాశముంటుంది. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అన్ని రకాల మార్గాలను అన్వేషిస్తున్నాం.

– పొన్నగంటి రమణ, ప్రధానోపాధ్యాయుడు, భీమునిపట్నం

హైస్కూలు సమాచారం	
నిర్వహిస్తున్న తరగతులు	6 నుంచి 10
విద్యార్థుల సంఖ్య	380
ఉపాధ్యాయులు	15
నాన్‌టీచింగ్ సిబ్బంది	3

ఎండాడ, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: ముసలయ్యపాలేనికి (సాగర్‌నగర్) ఆనుకుని ఉన్న జీవీఎంసీ పార్కు పరిసరాలు మందుబాబులకు అడ్డాగా మారింది.
– స్థానికులు, ముసలయ్యపాలెం

సమాధానం: సంబంధిత ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తాం.
– నాయుడు, ఆరిలోవ పోలీసులు

సమస్య: పద్మనాభం గ్రామంలోని పలు వీధుల్లో పైప్‌లైన్ మరమ్మతులకు గురై మంచినీరు వృథాగా పోతోంది.
– అవనపు రమణ, పద్మనాభం

సమాధానం: మంచి నీటి వృథాను అరికడతాం.
– మంచినీటి అధికారులు

సమస్య: గొల్లల ఎండాడ పార్కులో విద్యుద్దీపాలు వెలగక పార్కు వద్ద అంధకారం నెలకొంది.
– స్థానికులు, గొల్లల ఎండాడ

సమాధానం: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడుతాం. – సురేష్, విద్యుత్ ఏఈ

సంతను తరలించడంపై నిరసన



సేవా రహదారిపై బైఠాయించిన చిరు వర్తకులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయం సమీపంలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతను మళ్లీ తరలించేందుకు ప్రయత్నం చేయగా సీఐటీయూ ఆధ్వర్యంలో చిరువర్తకులంతా సేవారహదారిలో బైఠాయించి నిరసన తెలిపారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఉందని పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ కాంతారావు తన సిబ్బందితో చేరుకుని కొంత స్థలాన్ని విడిచిపెట్టి సంతను నిర్వహించుకోవాలని సూచించడంతో ఆందోళన విరమించారు. సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, డి.కొండమ్మ తదితరులు మాట్లాడుతూ.. కొమ్మాది కూడలి నుంచి పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వరకూ రోజూ నిరంతరం ట్రాఫిక్ నిలిచిపోయి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని.. ఆ సమస్యను పరిష్కరించకుండా అందరికీ ఉపయోగపడే వారంలో ఒకరోజు సంతను తరలించేందుకు యత్నించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఈ చర్యలు విరమించుకోవాలని కోరారు.

డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలి ఉన్న 69 సీట్ల భర్తీకి ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రధానాచార్యులు డా.సి.హెచ్.విష్ణుమూర్తి తెలిపారు. ఇందులో బి.ఎ (చరిత్ర) కోర్సులో 17 సీట్లు, బి.ఎ (రాజనీతిశాస్త్రం)లో 12 సీట్లు, బి.కాం(కంప్యూటర్స్)లో 11, బీఎస్సీ(భౌతిక శాస్త్రం)లో 10, బి.ఎస్సీ (రసాయినిక శాస్త్రం)లో 7, బి.ఎస్సీ (జంతుశాస్త్రం) 12 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య ధ్రువపత్రాలతో కళాశాలకు విచ్చేసి ప్రవేశాలు పొందాలని కోరారు.


విజినిగిరిపాలెంలో అన్నపూర్ణ అలంకరణలో ఉమాదేవి అమ్మవారు


తొలిపావంచా వద్ద..


గీతం వైద్య కళాశాల ప్రాంగణంలో..


సాగర్‌నగర్ బంగారమ్మ ఆలయంలో....


ఎండాడలో..


భీమిలి కీటిన్‌పేటలో..

భిక్షాం దేహి.. మాతా అన్నపూర్ణేశ్వరీ

నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్యరత్నాకరీ.. భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ.. అంటూ అశేష భక్తజనం జగన్మాతను భక్తిశ్రద్ధలతో స్తుతించారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భీమిలి నియోజకవర్గంలోని పలు ఆలయాలు, సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న పూజల్లో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. పరమేశ్వరుడికి అమ్మవారు భిక్ష అనుగ్రహిస్తున్నట్లుగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా పరమేశ్వరిని సేవించారు. – న్యూస్‌టుడే, సింహాచలం, మధురవాడ, కొమ్మాది, భీమునిపట్నం, ఎండాడ, సాగర్‌నగర్, తగరపువలస, గ్రామీణభీమిలి


మిథిలాపురి వుడాకాలనీ గాంధీ బొమ్మ కూడలి వద్ద..


తాటితూరులో నవ ధాన్యాలతో..


చంద్రంపాలెం జాతర గట్టుపై ఆలయంలో జడ్పీ సింహాచలం తదితరులు


భీమిలి సాగరతిరుమల క్షేత్రంలో..


భీమిలి డెక్కతిపాలెంలో..


మజ్జివలస గ్రామంలో..


పెద మంగమారిపేట వీబీసీ కాలనీలో..


మానం ఆంజనేయులు కాలనీలో..

సంప్రదాయబద్ధంగా అమ్మవార్ల తిరువీధి


విశేష పుష్పాలంకరణలో చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై అప్పన్న స్వామి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి పూజల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, పూలమాలలతో అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. పండితులు వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. తొలుత తాయార్ సన్నిధిలో విశేష పూజలు జరిగాయి. హంసమూలన పండితులు శ్రీరామాయణం పారాయణం చేశారు.

కమనీయం.. సిరి నరసింహుల నిత్యకల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో నిత్య కల్యాణోత్సవం శనివారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో దసరా ఉత్సవాలు శనివారం నుంచి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. నగరానికి చెందిన సిద్ధేంద్రయోగి నాట్యాలయం చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు సీహెచ్.మోహనలక్ష్మి దర్శకత్వం వహించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి కిరణ్మయి నృత్యనికేతన్ చిన్నారులతో శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నట్లు పరిపాలనాధికారి టి.విశ్వనాధ్‌రెడ్డి తెలిపారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

మారికవలసలో మారుతీసుజుకీ షోరూం ప్రారంభం

కొమ్మాది, న్యూస్‌టుడే: దసరా పండుగ పురస్కరించుకుని జయభేరి షోరూంలో మంచి ఆఫర్స్‌తో ఆధునిక టెక్నాలజీతో వాహనాలు అందుబాటులో ఉన్నాయని కొనుగోలుదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జయభేరి అధినేత, సినీనటులు మురళీమోహన్ పిలుపునిచ్చారు. మారికవలస సమీప మెట్రోమార్ట్ ఎదురుగా నూతన జయభేరి మారుతీ సుజుకీ షోరూంను శనివారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. సరసమైన ధరలతో వాహనాలను అందుబాటులో ఉంచామని, మధురవాడ ప్రాంతీయులంతా ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం కొనుగోలు చేసిన వాహనాన్ని వినియోగదారుడికి అందించారు. సీఈవో సున్నీబాబు, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నూతన వాహనాన్ని వినియోగదారుడుకి అందిస్తున్న జయభేరి అధినేత మురళీమోహన్


పతకం సాధించిన విద్యార్థి జి.అజయ్

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థి సత్తా

ఆనందపురం, న్యూస్‌టుడే: శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం సి.ఎస్.ఎం. విద్యార్థి జి. అజయ్ జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. గత నెల 30న ఉత్తరాఖండ్ దిండిగల్ నగరంలో జరిగిన అండర్-18 విభాగంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం విద్యార్థిని కళాశాల యాజమాన్యం అభినందించింది.

గంటాతో ఆనందపురం నాయకులు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం రెవెన్యూ గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు చెరకాని సూరినాయుడు, గుడిలోవ ఛానల్ నీటి సంఘం మాజీ ఛైర్మన్ కర్రోతు సత్యనారాయణ శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుని కలిశారు. ఈ మేరకు ఆనందపురం రెవెన్యూ గ్రామంలో ఓ ముఠా గత ప్రభుత్వ కాలంలో జరిపిన భూ కబ్జాలు, రెవెన్యూ దస్త్రాల్లోని స్వల్ప తప్పిదాలతో భూములు కాజేసిన విధానంపై వినతిపత్రం అందజేశారు. సంబంధిత భూ సమస్యలను వివరించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు లొడగల వెంకటరావు, కోరాడ నాయుడుబాబు తదితరులు గంటాను కలిసిన వారిలో ఉన్నారు.


ఎమ్మెల్యే గంటాను సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థులకు కార్యశాల

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: తగరపువలస అవంతి ఇంజినీరింగు కళాశాల ఈసీఈ విద్యార్థులకు కమ్యూనికేషన్ రంగంపై శనివారం కార్యశాల జరిగింది. అవంతి, బీఎస్ఎన్ఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంక్యూబేషన్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. నగరంలోని భారత సంచార నిగాం లిమిటెడ్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. బీఎస్ఎన్ఎల్ డీజీఎం డా.ఎం.సత్యప్రసాద్, ప్రిన్సిపల్ మురళీకృష్ణ, డైరెక్టరు చంద్రశేఖర్, హెచ్‌వోడీ శివభాస్కర్ పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఘనంగా సాంస్కృతిక కార్యక్రమం


తగరపువలస, న్యూస్‌టుడే తగరపువలస శ్రీ బాసర డిగ్రీ కళాశాల కల్చరల్ ఫెస్ట్ శనివారం జరిగింది. కళాశాల ఛైర్మన్ పూడి రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకను ప్రారంభించారు. డిగ్రీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా చేపట్టిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపల్ సీహెచ్.సురేశ్, వైస్ ప్రిన్సిపాళ్లు ఎం.శ్రీనివాసరావు, భాస్కరరావు, ఏవో కేశవ, ఇంటర్ కళాశాల ప్రిన్సిపల్ వీవీడీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో స్వరార్చన

మధురవాడ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మధురవాడ మిధిలాపురి వుడాకాలనీలోని శ్రీ భూనీళ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 'రాగా మ్యూజిక్ అకాడమీ' శిష్యుల బృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపకులు, సంగీత గురువు కావూరి నాగజ్యోతి ఆధ్వర్యంలో కళాకారులు కర్ణాటక సంగీతం ద్వారా త్యాగరాజ కృతులు ఆలపించారు. ఆయా కీర్తనలకు పలువురు భక్తి పారవశ్యంతో ముగ్ధులయ్యారు. చిన్నారులు ఎంతో ఇష్టపడి నేర్చుకున్న సంగీత కళను పండగ పర్వదినాల్లో ఆలయాల్లో ప్రదర్శించడం హర్షణీయమని ఆలయ కమిటీ ప్రతినిధి సాయిలీల పేర్కొన్నారు. టి.ఎన్.చైతన్య వాయిద్య సహకారం అందించారు.


మిధిలాపురి వుడా కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం


అప్పలరాజు (పాతచిత్రం)

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం - బాకురపాలెం రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందిన ఘటన ఇది. ఆనందపురం సీఐ సీహెచ్ వాసునాయుడు తెలిపిన వివరాలిలా.. తర్లువాడ గ్రామానికి చెందిన మజ్జి అప్పలరాజు (50) ఓ కంపెనీలో రోజువారీ కూలీగా పని చేస్తున్నారు. ఉదయం తర్లువాడ నుంచి బాకురపాలేనికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో బాలి అప్పలకొండ (38) అనే మహిళను బైకుపై ఎక్కించుకొని వెళ్తుండగా బాకురపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఒక్కసారిగా పడిపోయారు. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు స్థానికులు తరలించగా సాయంత్రం మృతి చెందాడు. వెనుకాల కూర్చొన్న మహిళకు స్వల్పగాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య అచ్చియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


బోర మహేశ్ (పాతచిత్రం)

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు పెందుర్తి సీఐ కేవీ.సతీశ్‌కుమార్ తెలిపారు. భీమిలి దరి పాత పరదేశిపాలెం ప్రాంతానికి చెందిన బోర మహేశ్(21) నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి సరిపల్లి దరి వాటర్ పార్కుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సరిపల్లి పెట్రోల్ బంకు సమీపంలో పెందుర్తి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు గాయమైన మహేశ్‌ను స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: జీవీఎంసీ నాల్గో వార్డులోని పలు ప్రాంతాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాలువలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. కె.నగరపాలెం పరిధి కాపుల దిబ్బడిపాలెంలో రూ. 19.20 లక్షలు, కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెంలో రూ. 19.50 లక్షలు, నిడిగట్టు పరిధి రెల్లిపేటలో రూ.19 లక్షల జీవీఎంసీ నిధులతో వీటిని నిర్మించనున్నట్లు తెలిపారు. జీవీఎంసీలో విలీనమైన పంచాయతీలు విశాఖ నగరంలో కీలకంగా మారనున్నాయన్నారు. భీమిలి మండలంలో మిగిలిన పంచాయతీలతో పాటు ఆనందపురం, పద్మనాభం మండలాన్ని జీవీఎంసీలో విలీనం చేసి అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భీమిలి జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి, ఏఈ ఎ.సుమన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు బి.మహాలక్ష్మీనాయుడు, ఏసీపీ శ్రీనివాసరావు, ఏపీడీ సంతోశ్, తెదేపా వార్డు అధ్యక్షుడు పాసి నర్సింగరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బోర బంగారరెడ్డి, మాజీ సర్పంచులు, నాయకులు దుంప నర్సింహమూర్తి, నారు ఎల్లాజీ, శీరపు రమణ, తదితరులు పాల్గొన్నారు.


కాపులుప్పాడలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆర్థిక చేయూత

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి కోనేటి కేశవ త్రినాథ్ ఆర్థికంగా ఇబ్బందిపడటం, తన కుమారుడు రాజేష్‌కు రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో తోటి విద్యార్థులంతా అండగా నిలిచారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం గ్రామంలో ఉంటున్న త్రినాథ్ నివాసానికి శనివారం వెళ్లి రాజేష్‌ను పరామర్శించి మెరుగైన చికిత్స కోసం రూ.30 వేలు నగదు అందించారు. ఆనందరావు, శ్రీరామ్మూర్తి, మంగరాజు, చంద్రమౌళి, వాండ్రాసి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

విశాఖ తూర్పు

వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ పరిధిలోని దయాల్‌నగర్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు. మూడు నెలల వ్యవధి గల కోర్సుల్లో సెల్‌ఫోన్ రిపేర్, నిర్వహణ, బ్లాక్ ప్రింటింగ్, డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, కటింగ్ అండ్ స్టిచింగ్, ఆఫీస్ అసిస్టెంట్ అండ్ కంప్యూటర్ ఆపరేటర్, కార్, ద్విచక్రవాహన మెకానిజంలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. పదోతరగతి విద్యార్హత కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు వయోభేదం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9963310611 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

★ సమస్య : హెచ్.బి.కాలనీ కొండవాలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగటం లేదు. – సుధాకర్

★ సమాధానం : పరిశీలించి మరమ్మతులు చేపట్టి, కొత్త దీపాలను అమరుస్తాం – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

★ సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-2 బాలాజీ పార్కు ప్రహరీకి ఆనుకుని చెట్టుకొమ్మల వ్యర్థాలు తరలించలేదు – లక్ష్మీ

★ సమాధానం: సిబ్బందిని నియమించి వ్యర్థాలను తరలిస్తాం.– సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అవీ ఇవీ

ఫార్మా కంపెనీల్లో స్థానికులకు అవకాశం కల్పించాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ఉత్తరాంధ్ర ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థానికులకు 70 శాతం అవకాశం కల్పించాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు లగుడు గోవిందరావు కోరారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలన్నారు. ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలన్నారు.

ఆర్టీసీ ఛైర్మన్‌ను కలిసి ఎన్ఎంయూ నాయకులు

స్వర్ణభారతి, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును శనివారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) నాయకులు అమరావతిలోని ఆర్టీసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ నాయకులు శ్రీనివాసరాజు, పీవీ మోహన్, ఆర్.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

కేఆర్ఎం.కాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1991-94 ఎంపీసీ పూర్వవిద్యార్థుల సంఘం వారు కళాశాలకు సిమెంట్ బల్లలు వితరణ చేశారు. శనివారం వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజన చట్టం అమలు విధానాలపై సీఎస్‌కు లేఖ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆయన పునర్విభజన చట్టం అమలు విధానాలపై సీఎస్‌కు లేఖ రాశారు. రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను ఆయన వివరించారు. నాటి తెదేపా, తర్వాత వచ్చిన వైకాపా కూడా సిఫార్సులను విస్మరించాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాలు శివరామన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా లేవన్నారు. ప్రాంతీయ అసమతుల్యతలను సరిదిద్దాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాలన్నారు. అయితే ఉత్తర కోస్తా ప్రజల మనోభావాలను గౌరవించకుండా అమరావతిపై పెట్టుబడులు పెట్టడం వివేకం కాదన్నారు.

స్వచ్ఛతలో మేటి...!

జల సంరక్షణ, పరిశుభ్రతలో జేఆర్.నగర్‌కు ప్రత్యేక గుర్తింపు

జగన్నాథరాజునగర్ అని పేరు వినగానే అందరికి గుర్తుకువచ్చేది పచ్చదనంతో పరిశుభ్రతతో కనిపించే కాలనీ. కాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులంతా కలిసికట్టుగా కాలనీ అభివృద్ధి, నిర్వహణలో భాగస్వాములు కావటంతో ఏటేటా ఈ కాలనీకి అవార్డులు వరిస్తున్నాయి. ఇటీవల కూడా జీవీఎంసీ నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో అవార్డు అందుకుంది. ఈ ఏడాది మాత్రమే కాదు ప్రతీ ఏటా కాలనీ స్వచ్ఛ సంరక్షణలో అవార్డులు సొంతం చేసుకోవటం విశేషం.

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



శుభ్రంగా జేఆర్‌నగర్ కాలనీ

★ కాలనీలో పరిశుభ్రత పాటించటం, పచ్చదనం పెంపొందించటం, జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వటం వంటి వాటిలో కాలనీవాసుల సహకారం మరువలేనిదని కాలనీ సంఘం ప్రతినిధులు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి, కె.దేవేంద్రవర్మ, బి.పెరుమాళ్లరాజు, డి.గంగాధరం తెలిపారు.

ఇంకుడుగుంతలతో జలసంరక్షణ

తూర్పు నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 7 నుంచి 8 ఎకరాల స్థలం విస్తీర్ణంలో జగన్నాథరాజునగర్‌కాలనీ వెలిసింది. కాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఏర్పాటై దాదాపుగా 30 ఏళ్లు అవుతోంది. ఇక్కడ సుమారు 25 అపార్టుమెంట్‌లు, 30 వరకు వ్యక్తిగత నివాసాలు ఉండగా, కాలనీలో సుమారు 2వేల వరకు జనాభా ఉన్నారు. రెండు ప్రధాన రహదారులు ఉండగా, మూడు అంతర్గత రహదారులతో కాలనీ అభివృద్ధి చెందింది.

★ కాలనీ నివాసుల సంక్షేమ సంఘం ద్వారా కాలనీలో అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించటమే కాకుండా కాలనీని పరిశుభ్రతగా ఉంచటంతో పాటు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుంటారు. అందరిలో జాతీయ స్ఫూర్తిని కలిగించేలా జాతీయ పండగలు ఇక్కడ ఎంతో ఘనంగా జరుపుతారు. కాలనీలో వినాయక చవితి వంటివి కాలనీవాసులంతా కలిసి జరపటం విశేషం.

★ కాలనీకి నీటి ఎద్దడి రాకుండా కాలనీవాసులంతా కలిసి జల సంరక్షణకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ నిర్మించిన, నిర్మించబోయే ప్రతీ ఇంటికి ఇంకుడుగుంతలు తప్పనిసరిగా నిర్మిస్తున్నారు. అలానే రహదారుల నుంచి వర్షపు నీరు కాలువలోకి పోకుండా రహదారులపై ఇంకుడు గుంతలు నిర్మించటం విశేషం. ఇలా అన్ని రహదారుల వద్ద సుమారు 10 వరకు ఇంకుడుగుంతలను నిర్మించి, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటూ అందరికి స్ఫూర్తిగా నిలిచారు.

★ జల సంరక్షణ విభాగంలో 2019లో కేంద్ర జల మంత్రిత్వశాఖ అవార్డు, 2020లో సంఘం అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తికి వాటర్ హీరో అనే అవార్డు, 2024లో వాటర్ డైజెస్టు సంస్థ జల సంరక్షణపై అవార్డులు వచ్చాయి. ఇక ప్రతీ ఏడాది నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కాలనీ స్వచ్ఛతకు అవార్డులు అందుకుంటోంది. ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం తప్పనిసరిగా జేఆర్.నగర్ కాలనీని సందర్శించి, కాలనీవాసులను అభినందిస్తుంటారు.



కాలనీలో ఇంకుడుగుంతలు

మాతృ కళాశాలలకు పంపాలంటూ వినతి



ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో మాట్లాడుతున్న ఏయూ జేఏసీ కమిటీ సభ్యులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డెప్యుటేషన్‌పై వచ్చిన ఎయిడెడ్ ఫ్యాకల్టీ గడువు నవంబరు 13తో ముగుస్తున్నందున వారిని గడువుతీరిన తర్వాత వారి మాతృ కళాశాలలకు పంపించాలని ఏయూ జేఏసీ సభ్యులు శనివారం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును కలిసి వినతి పత్రం అందించారు. ఏయూ టీచర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్, టెంపరరీ టీచింగ్ అరేంజ్మెంట్ అసోసియేషన్ సంయుక్తంగా 'సంయుక్త కార్యచరణ కమిటీ'గా ఏర్పడ్డాయి. ఈ కమిటీ సభ్యులు రిజిస్ట్రార్‌తో కలిసి ఎయిడెడ్ ఫ్యాకల్టీలను వారి మాతృ కళాశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య ప్రేమానందం, ఆచార్య ధనరాజ్, ఆచార్య నల్ల సత్యనారాయణ, డాక్టర్ పుష్పరాజ్యం, డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ దాసు, డాక్టర్ సురేష్ మీనన్, డాక్టర్ జగదీష్, డాక్టర్ మృత్యుంజయ్ తదితరులు ఉన్నారు.

పండగకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. నవంబరు 7 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రతీ గురువారం న్యూటిన్‌సుఖియా- ఎస్.ఎం.వి.టి బెంగళూరు (05952) ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. నవంబరు 11 నుంచి డిసెంబరు 30 వరకు ఎస్.ఎం.వి.టి బెంగళూరు- న్యూటిన్ సుఖియా (05951) రైలు దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం మీదుగా రాకపోకలు సాగించనున్నట్లు తెలిపారు. విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు: ఈనెల 6, 7, 8 తేదీల్లో విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు (07215),7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళం రోడ్డు- విజయవాడ (07216) ప్రత్యేక రైలును నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ రైలు సేవలను వినియోగించుకోవాలని కోరారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



వాల్తేరు కూడలిలో..



విశేష అలంకరణలో రాజరాజేశ్వరిదేవి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎంవీపీకాలనీ సెక్టారు-6లోని పార్వతీముక్తీశ్వరాలయంలో పార్వతీదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. వాల్తేరు కూడలి విజయదుర్గ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

★ శ్రీసాయి గోకుల గురుదత్త విహార్ సాయి సుధాకర పూర్ణానందస్వాజీజి ఆధ్వర్యంలో భద్రం సామాజిక భవనంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సహిత శ్రీదత్త వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపారు. సాయంత్రం నుంచి ఆలయంలో ప్రత్యేకపూజలు జరిపారు. ★ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీకాలనీ సెక్టారు-6 వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో మయూరి నృత్య అకాడమీకి చెందిన కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో మెప్పించారు.

దుర్గమ్మకు విశేష పూజలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పెదగదిలి అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మాలధారణ భక్తులు అమ్మవారికి విశేష పూజ నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు.



దుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న మాలధారులు



సెక్టారు-6 వేంకటేశ్వరస్వామి ఆలయంలో విద్యార్థినుల నృత్యప్రదర్శన

మంచుతో తయారు చేసిన శివలింగం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం 22వ వార్డు పీతలవానిపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఉత్సవాల్లో ఐస్‌తో తయారు చేసిన శివలింగం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి పూజలు చేశారు.



పీతలవానిపాలెంలో మంచు శివలింగం

చినగదిలి నేతాజీనగర్‌లో..

ఆరిలోవ, న్యూస్‌టుడే: చినగదిలి నేతాజీనగర్‌లో ఉన్న శ్రీలలితా పరమేశ్వరిదేవి అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో ఉదయం మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం లలితా పారాయణం జరిగింది. పూజా కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాయన వెంకటఅప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నపూర్ణా దేవిగా శ్రీలలితా పరమేశ్వరిదేవి అమ్మవారు

మొదలైన బ్యాడ్మింటన్ అకాడమీ పనులు



స్థలాన్ని చదునుచేస్తున్న దృశ్యం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆనుకుని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో చెట్లు తొలగిస్తున్నారు. రెండ్రోజులుగా ఈ పనులు జరుగుతున్నాయి. చదునుచేసి అకాడమీకి అప్పగించాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సులో పాల్గొననున్న ఏయూ



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : 2025 ఫిబ్రవరి 20, 21 తేదీల్లో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ప్రజారోగ్యంపై జరగనున్న గ్లోబల్ సదస్సుకు సంబంధించి శనివారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు. ఈ సదస్సులో ఆంధ్రవిశ్వవిద్యాలయం భాగస్వామ్యం కానుంది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి బృందంతో రిజిస్ట్రార్ వర్చువల్‌లో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన ఎం.ఒ.యు. చేసుకునేందుకు చర్చించారు.

అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే



గరికపాటికి స్వామివారి ప్రతిమను అందజేస్తున్న సింహాచలం ప్రధాన అర్చకులు శ్రీనివాస ఆచార్యులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం దేవీ వైభవం పేరుతో ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ.. అమ్మవారిని కేవలం దసరా వేడుకల్లో కొలవడమే కాకుండా ప్రతీరోజు పూజించాలని అన్నారు. సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాస ఆచార్యులు స్వామివారి ప్రతిమను గరికపాటికి అందజేశారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రోగ్రాం ఛైర్మన్ జగన్ మోహన్, అధ్యక్షులు వినయ్‌గాంధీ, సెక్రటరీ మణిమాల, కోశాధికారి ఎం.కె.కుమార్ పాల్గొన్నారు.

తీరమంతా వ్యర్థాలే..

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆహ్లాదాన్ని పంచాల్సిన తీరం వ్యర్థాలతో నిండిపోతుంది. వాసవానిపాలెం, జాలారి ఎండాడ తీరమంతా వ్యర్థాలతో అధ్వానంగా మారింది. గెడ్డ నుంచి వచ్చిన వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలుస్తుండటంతో అవి కెరటాల తాకిడికి తిరిగి ఒడ్డుకు చేరుకుంటున్నాయి. దీంతో తీరమంతా ఇదే పరిస్థితి. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తీరంలో వ్యర్థాలు

అభివృద్ధి పనులు ప్రారంభం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: చినవాల్తేరు పోలీసు క్వార్టర్స్‌లో ఇటీవల చేపట్టిన పనులు పూర్తి కావడంతో పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శనివారం ప్రారంభించారు. గతంలో ఒకసారి క్వార్టర్స్‌ను ఆయన పరిశీలించినపుడు ఇక్కడ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఆ మేరకు పనులు పూర్తిచేయించారు. డ్రైనేజీ పనులు, సీసీ కెమెరాల ఏర్పాటు, క్వార్టర్స్ చుట్టూ పొదల తొలగింపు, ప్రహరీ నిర్మాణం, తదితర పనులు పూర్తికావడంతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను చిన్నారులు స్వాగతం పలికారు.



పిల్లలతో ముచ్చటిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సంప్రదాయబద్ధంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై అప్పన్న స్వామి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి పూజల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, పూలమాలలతో అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. పండితులు వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు.


సంబరాల సందడి..



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : సమతా డిగ్రీ, పీజీ కళాశాలలో దసరా పండగ, శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సంబరాలు సందడిగా సాగాయి. కళాశాల డీన్ విజయారవీంద్ర, డైరెక్టర్ శ్రీనివాసరావులు వేడుకలు ప్రారంభించారు. దసరా పండగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు కోలాటం, బతుకమ్మ, దాండియా నృత్యాలతో మెప్పించారు.

వరద బాధితులకు విరాళం



ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న డాక్టర్ వి.విద్యాసుందర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం ఏయూ అనుబంధ కళాశాల అల్ సెయింట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.లక్ష సహాయాన్ని అందించింది. సంస్థ ఛైర్మన్ డాక్టర్ వి.విద్యాసుందర్ శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును తన కార్యాలయంలో కలిసి చెక్కును అందించారు. వీటిని ఏయూ తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి జాడేది!



పెదజాలారిపేట శ్మశాన వాటిక

నియోజకవర్గంలో ఏదో ఒకట్రెండు శ్మశానవాటికలు మినహా చాలా వాటిలో కనీస సౌకర్యాలు ఉండటం లేదు. నగరపాలక సంస్థ కూడా వీటి అభివృద్ధి విషయంలో దృష్టి పెట్టడం లేదు. శ్మశానం అనగానే అదేదో చిన్నచూపు చూస్తున్నారు. దీంతో అంత్యక్రియల సమయంలో మృతుల బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, పెదవాల్తేరు

పెదజాలారిపేట శ్మశానవాటిక సముద్ర తీరానికి ఆనుకుని ఉంటుంది. 19, 20, 21 వార్డులకు సంబంధించి ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలకు ఇక్కడకు తీసుకువస్తారు. అయితే ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో మృతిచెందిన వారి సంబంధీకుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు.. : ఈ శ్మశానవాటిక పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. ప్రహరీ లేకపోవడంతో రాత్రయితే చాలు మందుబాబులు చేరుతుంటారు. మత్తు పదార్థాలు తీసుకునే వారు ఇక్కడే తిష్ఠ వేస్తుండటంతో ఇటు వెళ్లాలంటే భయపడుతున్నారు. దీనివల్ల సమీప ప్రాంతాల వారు కూడా భయపడుతున్నారు.

కాటికాపరి లేక...: శ్మశానవాటికకు కాటికాపరి కూడా లేరు. అనధికారికంగా ఎవరు పడితే వారే కాటికాపరిగా వ్యవహరిస్తుంటారు. ఎవరైనా చనిపోతే పూడ్చడానికి రూ.6,500, కాల్చడానికి రూ.8 వేలు డిమాండ్ చేస్తున్నారు. చేసేది లేక.. ఆ సమయంలో బేరాలు ఆడలేక అడిగింది ఇచ్చి పనులు చేయించుకోవాల్సి వస్తోంది.

మరణ ధ్రువపత్రాలకు తప్పని ఇబ్బంది..: ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని పథకాలకు, ఇన్సూరెన్స్‌లకు మరణ ధ్రువపత్రాలు తప్పనిసరి. అయితే ఈ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించిన వారు ఆ ధ్రువపత్రం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మృతిచెందిన వ్యక్తి వివరాలు నమోదు చేయడానికి ఇక్కడ ఎవరూ ఉండకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సచివాలయాల వెంట తిరగాల్సి వస్తోంది.



నిరుపయోగంగా భవనం

ఆ భవనం ఎందుకో?: గతంలో శ్మశాన వాటిక ఆవరణలో ఓ భవనం ఏర్పాటు చేశారు. దీనిని ఎందుకు ఏర్పాటు చేశారో తెలియదు. పోనీ దాన్ని ప్రారంభించి, కాటికాపరిని నియమించి వినియోగించుకోవాలనే ఆలోచన కూడా చేయడం లేదు. అది నిర్మించి వృథాగా ఉంది. ఆ భవనం తీసి ఉంటే వర్షాల సమయంలో జనం అక్కడ ఉండటానికి అవకాశం ఉంటుంది.

ఉద్యానవన అభివృద్ధి బాధ్యత తీసుకుంటాం

– వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ విశ్వనాథన్



మొక్కను నాటుతున్న కమిషనర్ విశ్వనాథన్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనాన్ని వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శనివారం సందర్శించారు. పార్కులోని అరుదైన మొక్కలను పరిశీలించారు. సుమారు గంటపాటు పార్కులో ఉన్నారు. పార్కు నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి అక్కడ మొక్కల ప్రత్యేకతను వివరించారు. పార్కును అభివృద్ధి చేసే బాధ్యత వి.ఎం.ఆర్.డి.ఎ. తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యానవనంలో ఓ మొక్కను నాటారు. డాల్ఫిన్ కన్జర్వేటివ్ సొసైటీ కోఫౌండర్ మంగతాయి, వైస్ ప్రెసిడెంట్ జె.ఎస్.ప్రసాద్, జోగారావు, వి.ఎం.ఆర్.డి.ఎ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

పండగకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రత్యేక రైళ్లు నడపుతున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. నవంబరు 7 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రతీ గురువారం న్యూటిన్‌సుఖియా-ఎస్.ఎం.వి.టి బెంగళూరు (05952) ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. నవంబరు 11 నుంచి డిసెంబరు 30 వరకు ఎస్.ఎం.వి.టి బెంగళూరు- న్యూటిన్ సుఖియా (05951) రైలు దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం మీదుగా రాకపోకలు సాగించనున్నట్లు తెలిపారు. విజయవాడ-శ్రీకాకుళం రోడ్డు: ఈనెల 6, 7, 8 తేదీల్లో విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు (07215), 7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళం రోడ్డు- విజయవాడ (07216) ప్రత్యేక రైలును నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ రైలు సేవలను వినియోగించుకోవాలని కోరారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో సైన్స్ అండ్ టెక్నాలజీపై సదస్సు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : నగరంలోని జ్ఞానాపురం దరి సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంలో భాగంగా వృక్షశాస్త్రం, బయోటెక్నాలజీ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిపై శనివారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన ఏఐ టెక్నాలజీని ఉపయోగించడంతో అనేక పనులు సులభతరం అవుతాయన్నారు. సిస్టర్ షైజీ మాట్లాడుతూ.. అధునాతన ఆవిష్కరణలను అందరూ పంచుకోవడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గీతం కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శాంతిలత పాల్గొన్న వారికి జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలను అందజేశారు. కళాశాల కన్వీనర్ డాక్టర్ ఎం.పద్మసుందరి, కో కన్వీనర్లు డాక్టర్ ఎ.వీరబ్రహ్మం, ఎస్.ఎల్.ఊర్మిళ, సిస్టర్ హేమ, డాక్టర్ అరుణాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లాబొరేటరీ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్

ప్రజా మరుగుదొడ్లు కరవాయే.. ఇంటికెళ్లేంత వరకు ఉగ్గబట్టాల్సిందే..

గురుద్వారా, న్యూస్‌టుడే

ఉత్తర నియోజకవర్గంలో సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నక్కవానిపాలెం ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు కరవయ్యాయి. దీనివల్ల వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చే మహిళలు, వీధి వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సత్యంకూడలి మొదలుకొని సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ఇరువైపుల ప్రాంతమంతా వాణిజ్యపరమైందిగా పేరుగాంచింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దుకాణ సముదాయాలు ఉండటంతో నిత్యం జనాభాతో రద్దీగా ఉంటుంది. కార్యాలయాలకు పని నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు, దుకాణాల్లో పనిచేసే మహిళలు, వీధి వ్యాపారాలు చేసే వారు అధిక సంఖ్యలో ఉంటారు. వారంతా మూత్రవిసర్జనకు వెళ్లడానికి పడరాని పాట్లు పడుతున్నారు. తమ పనులు పూర్తయ్యే వరకు మిన్నకుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీధి వ్యాపారాలు చేసే మహిళలు రోజంతా అక్కడే ఉండక తప్పదు. పోనీ ఇంటికి వెళ్లి వద్దామంటే వ్యాపారం పోతుందేమోనని భయంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇది వరకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం, నక్కవానిపాలెం ప్రాంతాల్లో మరుగుదొడ్లు అందుబాటులో ఉండటంతో అవసరాలు తీర్చుకునేవారు. అయితే సీతమ్మధార దరి మరుగుదొడ్డిని వ్యాపారం నిమిత్తం ఒక దుకాణదారుడు కూల్చివేయించగా... నక్కవానిపాలెం కొత్త ఏఎంజీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న దాన్ని నిర్వహణ సరిగా లేక మూసివేశారు. ప్రస్తుతం ఆ రెండూ లేకపోవడంతో అత్యవసరమైతే గురుద్వారా కూడలిలో గల మరుగుదొడ్లకి పరుగెట్టక తప్పడం లేదు. సుమారు అర కిలోమీటరు దూరం ఉండటంతో అక్కడికి వెళ్లలేక తమ పనులు అయ్యేంత వరకు ఉగ్గపట్టుకుని ఉంటున్నారు. గతంలో ఈ సమస్యపై వ్యాపారస్తులు, దుకాణాల్లో పనిచేసే మహిళలు పలువురు ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా... ప్రయోజనం కనిపించలేదు. ఈ మాదిరి చాలా మందికి ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో బయటకు చెప్పుకోలేక మల మూత్రాలకు ఎక్కడికి వెళ్లాలో తెలియక సతమతమవుతున్నారు. ఇలా రోజంతా ఉగ్గబట్టుకుని ఉంటే అనారోగ్య సమస్యలకు గురికాక తప్పదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనసంచారం అధికంగా ఉండే ఇలాంటి ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించే విషయంపై ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు.



సీతమ్మధారలో ప్రారంభించకుండా వదిలేసిన ప్రజా మరుగుదొడ్డి

ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు

ప్రజలు ఇబ్బందులను గుర్తెరిగి అప్పటి ప్రజాప్రతినిధి ఆదేశాలతో జీవీఎంసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులు లక్షలాది రూపాయలతో శరవేగంగా సీతమ్మధార సాయిబాబా మందిరానికి వెళ్లే మార్గంలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. అది జరిగి దాదాపు పదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ అవి ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. కనీసం వాటిని పట్టించుకునే పాపాన పోలేదు. నిర్వహణ లేకపోవడంతో లోపల సామగ్రి అంతా మరమ్మతులకు గురైంది. ప్రజా ధనం వృథా తప్ప, ప్రజలకు ఒరిగిందేమీ లేదని వాటిని చూసిన వారంతా వాపోతున్నారు. వీటిని అందుబాటులోకి తెస్తే సమీప ప్రాంతాల్లో ఉండే వీధి వ్యాపారస్తులు, ఆటోడ్రైవర్లు, దుకాణాల్లో పనిచేసే మహిళలకు ఉపయోగకరంగా ఉంటుంది. అప్పట్లో హడావిడి చేసి వదిలేశారే తప్ప, ఎందుకు ప్రారంభించలేదనే విషయం ఇప్పటికీ తెలియడం లేదు. ఇప్పటికైనా వాటిపై దృష్టి సారించి అందుబాటులోకి తెస్తే కొంతమందికైనా మేలు జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందంజ

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-8 వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ ఆశయాలకు అనుగుణంగా తొలినాళ్లలో ఏర్పడి, నేటికీ నిబద్ధతతో క్రమశిక్షణగా సేవలందిస్తున్న వాకర్స్‌క్లబ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పల్లా చంద్రమౌళి అధ్యక్షోపన్యాసంలో గడచిన 9నెలల్లో క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. మూలనిధిలో లక్ష రూపాయలు జమ, వాకర్స్ ఇంటర్నేషనల్ సొంత భవనానికి రూ. 100116 అందజేత, పర్యావరణ పరిరక్షణకు 600 మొక్కలను నాటడం, ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం వంటివి వివరించారు. అనంతరం వాకర్స్‌వాయిస్ అక్టోబర్ నెల సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రాళ్లపల్లి సత్యనారాయణ, కె. ద్వారకనాథ్, ఆర్.నాగేశ్వరరావు, సి. హెచ్. ప్రసాదరావు, జె.కూర్మారావు, పెంటకోట శ్రీనివాసరావు, క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న గవర్నర్ టి.రంగారావు

కవితా సంపుటి ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహేష్ రచించిన 'పటమటీది నాటకం' కవితా సంపుటి ఆవిష్కరణ సభ విశాఖ పౌరగ్రంథాలయంలో జరిగింది. యూనివర్సిటీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం ముఖ్య అతిథిగా హాజరై కవితా సంపుటిని ఆవిష్కరించి కొన్ని కవితలను చదివి వాటిని విశ్లేషించి రచయితను అభినందించారు. సాహితీ విశ్లేషకులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ కవిత్వాన్ని విశ్లేషిస్తూ ప్రత్యేకతలను విశదీకరించారు. సభ నిర్వహణ మేడా మస్తాన్ రెడ్డి చేయగా సభాధ్యక్షులుగా ఉప్పల అప్పల రాజు వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఎస్.హనుమంతరావు, డాక్టర్ బండి సత్యనారాయణ, డాక్టర్ సి.ఎస్. క్షేత్రపాల్ రెడ్డి, మేకా రత్నరాజు, పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.



'పటమటీది నాటకం' సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.ఎస్.చలం తదితరులు

7న సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శన

మాధవధార, న్యూస్‌టుడే: ఈ నెల 7న పోర్టు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోర్టు అథారిటీ, పించనర్ల ఆధ్వర్యంలో పోర్టు కళావాణి ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సత్య హరిశ్చంద్ర అనే పద్య నాటకం నిర్వహించనున్నట్లుగా పించనర్ల సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలియజేశారు. పించనర్లలో ఉన్న కళాకారులు అందరూ కలిసి ఈ నాటకం ప్రదర్శిస్తున్నారని, ప్రజలందరూ హాజరుకావాలని కోరారు.

దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఫిర్యాదు

గురుద్వారా, న్యూస్‌టుడే: వ్యాపారం చేసుకుంటున్న దుకాణాన్ని రౌడీలతో బలవంతంగా ఖాళీ చేయించారని ద్వారకా పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా.. ముక్కా పూర్ణచంద్ర వరప్రసాద్ అనే వ్యక్తి 2005 నుంచి సీతంపేటలో సిరివందన పేరుతో ఫ్లోర్‌మిల్ నడుపుతున్నారు. దుకాణం విషయమై యజమానికి, వరప్రసాద్‌కు మధ్య న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం దుకాణం సమయంలో యజమాని కొంత మంది రౌడీలతో వచ్చి బెదిరించి అందులో ఉన్న సామగ్రి అంతా బయటకు పడేశారు. తనకు రక్షణ కల్పించాలంటూ వరప్రసాద్ పోలీసుల్ని ఆశ్రయించడంతో పరిశీలిస్తున్నారు.

కెమికల్ కోర్సులతో ఉపాధి మెండు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. కెమికల్, పెట్రోకెమికల్, ప్లాస్టిక్‌పాలిమర్స్, ఆయిల్ టెక్నాలజీ విద్యార్థులు నృత్యాలు చేశారు. అంతకు ముందు విశ్రాంత ఆచార్యులు శ్రీరామూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్ బాగుండాలంటే ఎలా చదవాలి, ఏపీ సబ్జెక్టుల్లో మార్కులు ఎలా స్కోరు చేయవచ్చో వివరించారు. ఉద్యోగ అవకాశాలు దండిగా ఉన్న కెమికల్ కోర్సుల్ని ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో సద్వినియోగం చేసుకున్నట్లయితే మంచి ఉపాధి అవకాశాలు చేజిక్కితాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు శ్రీరామూర్తి



పాల్గొన్న విద్యార్థులు

అన్నపూర్ణగా దుర్గాదేవి





కంచరపాలెం : ఊర్వశికూడలి సమీప దేవాలయం వద్ద శ్రీదుర్గమాంబ, శ్రీకుంచుమాంబ అమ్మవారి అలంకరణ



అన్నపూర్ణాదేవి అవతారంలో లలితాదేవి



నవదుర్గల వేషధారణలో కాలనీ చిన్నారులు

ఆకట్టుకున్న సంగీత కచేరీ

మురళీనగర్, న్యూస్‌టుడే : స్థానిక సీతారామాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా లలితాదేవి అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంలో అలంకరించారు. ఉదయం జరిగిన ప్రత్యేక పూజల్లో కాలనీవాసులు పాల్గొని అమ్మ ఆశీస్సులు అందుకున్నారు. సాయంత్రం శ్రీ సత్యమాధవి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీత కచేరీ నిర్వహించారు. నవదుర్గలుగా చిన్నారులు అమ్మవారి అవతారాలలో అభినయించి అందరినీ ఆకట్టుకున్నారు.



మాధవధార : సీతన్నగార్డెన్స్‌లో అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవారు



కంచరపాలెం : రెడ్డి కంచరపాలెం సన్‌రైజ్ క్లబ్ వద్ద శ్రీదుర్గమాంబ అమ్మవారి ఆలయంలో అలంకరణలు



కార్పొరేషన్ (జగదాంబ కూడలి): పాతనగరంలోని కన్యకాపరమేశ్వరిని గాయత్రి దేవిగా అలంకరించిన దృశ్యం



కార్పొరేషన్ (జగదాంబ కూడలి): డాబాగార్డెన్స్ సమీపంలోని ఉమాదేవి ఆలయంలో అన్నపూర్ణదేవి అవతారంలో ఉమాదేవి



సీతంపేట : 25వ వార్డు సీతంపేటలోని శ్రీ పార్వతీశ్వర ఆలయంలో గల శ్రీ పార్వతీశ్వర ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు





గురుద్వారా : సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలో దుర్గాదేవి నవరాత్రి, శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామిని తిరుమల వెంకటేశ్వరుని అవతారంలో, అమ్మవారిని మీనాక్షిగా అలంకరించిన దృశ్యం

మహాసభలను జయప్రదం చేయండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. శనివారం సీఐటీయూ జగదాంబ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాజపా పట్టణ సంస్కరణలను అమలు చేసి, గత ప్రభుత్వం పట్టణ ప్రజలపై విపరీతమైన భారాలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలను తొలగించాలన్నారు. డిసెంబరు 28, 29 తేదీలలో పెందుర్తిలో సభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, బి.జగన్, బి.రమణి, బి.వెంకటరావు పాల్గొన్నారు.



సీపీఎం జిల్లా మహాసభల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్రమ దుకాణాల తొలగింపు

గురుద్వారా, న్యూస్‌టుడే: సత్యంకూడలి నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు కూడలికి వెళ్లే రహదారి ఇరువైపులా కాలిబాటలో ఆక్రమణలపై ద్వారకా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం 'కాలిబాట ఖాళీ లేదాయే' అనే శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన ట్రాఫిక్ ఎస్.ఐ భాస్కరరావు సిబ్బందితో దుకాణాలను తొలగించారు. పాదచారులు నడిచేందుకు వీలుగా ఉండాలని, దుకాణాలు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈనాడు కథనానికి స్పందన



దుకాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్.ఐ భాస్కరరావు, సిబ్బంది

రొమ్ము క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే అదుపు చేయొచ్చు


వన్‌టౌన్, న్యూస్‌టుడే: రొమ్ము క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే అదుపు చేయవచ్చునని ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప పేర్కొన్నారు. కేజీహెచ్ మెడికల్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసోత్సవాలను శనివారం ప్రారంభించారు. రొమ్ము క్యాన్సర్‌కు దారి తీసే కారకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు అవసరమైన మెమోగ్రఫీ పరీక్షలను కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తామన్నారు. రోజుకు 10 నుంచి 15 మందికి చొప్పున సెలవు దినాలు మినహా మిగిలిన అన్ని రోజుల్లో రానున్న రెండు నెలల పాటు పరీక్షలు నిర్వహించనున్నామని 40 ఏళ్లు దాటిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద, చిత్రంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ శిల్ప తదితరులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన సీతంరాజు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను విశాఖ దక్షిణ నియోజకవర్గం తెదేపా సమన్వయకర్త సీతంరాజు సుధాకర్ శనివారం విజయవాడలో కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పథకాల అమలు, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం అమలు తదితర అంశాలను లోకేశ్ దృష్టికి సీతంరాజు తీసుకెళ్లారు. నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల, సామాజిక భవనాల నిర్మాణాలు, యూజీడీ, గెడ్డల నవీకరణ, రహదారుల పునరుద్ధరణ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లానని సీతంరాజు తెలిపారు.



మంత్రి నారా లోకేశ్‌తో సీతంరాజు సుధాకర్

వాహనాలకు నో పార్కింగ్ సంకెళ్లు..!

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే

ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి వెళ్తున్న వాహనాలకు సంకెళ్లు వేసి సీజ్ చేయడానికి కూడా ఆర్పీఎఫ్ పోలీసులు వెనుకాడటం లేదు. ఈ విధంగా సుమారు 50 వాహనాలపై శనివారం కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు.



స్టేషన్ సమీపంలో పార్కింగ్ కేంద్రం ఇలా



రైల్వేస్టేషన్ గేట్-3 వద్ద విడిచి వెళ్లిన వాహనాలకు వేసిన గొలుసులు ఇలా



నో పార్కింగ్ జోన్‌లో ఉన్న వాహనాలకు తాడుతో బంధించినా అవేమి పట్టించుకోకుండా.. తాడుపై నిలిపిన వాహనం..

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులను గుత్తేదారులు సకాలంలో పూర్తిచేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని కమిషనర్ పి.సంపత్‌కుమార్ కోరారు. శనివారం జీవీఎంసీ గుత్తేదారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గుత్తేదారుల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ జీవీఎంసీ చెల్లించాల్సిన ఈఎండీ (ఎర్న్డ్ మనీ డిపాజిట్), సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాల్సిన నిధులు త్వరగా విడుదల చేయాలని కోరారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, వ్యయ పరిశీలకుడు వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుత్తేదారులతో సమావేశమైన కమిషనర్ సంపత్‌కుమార్, ఇతర అధికారులు

ఉక్కు ప్రైవేటీకరణ ఆపకుంటే మద్దతు ఉపసంహరించాలి

సీతంపేట, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆపకుంటే కేంద్ర ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉపసంహరించుకోవాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఆయన విశాఖ పౌరగ్రంథాలయంలో శనివారం విలేకరులతో ప్రజా సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. ఉక్కు కర్మాగారం బేషరతుగా విరమించి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించి ఉక్కు కర్మాగారానికి రూ.పదివేల కోట్లు నిధులు వర్కింగ్ కేపిటల్‌గా కేటాయించాలని అన్నారు. సమావేశంలో పి.ఒ.డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, విశాఖ సిటిజన్ ఫోరం అధ్యక్షులు పి.ఎన్.తిలక్, న్యాయవాదుల కె.ఎస్.చలం, సూర్య ప్రకాష్, భారత నాస్తిక సమాజం ప్రతినిధి జె.రవి, పి.ఒ.డబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి రామచంద్ర కిశోర్, మురికివాడ నివాసుల నిర్మూలన పోరాట సమితి డెంకాడ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నాయకులు

వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ పరిధిలోని దయాల్‌నగర్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు. మూడు నెలల వ్యవధి గల కోర్సుల్లో సెల్‌ఫోన్ రిపేర్, నిర్వహణ, బ్లాక్ ప్రింటింగ్, డ్రస్‌డిజైనింగ్ అండ్ టైలరింగ్, కటింగ్ అండ్ సూయింగ్, ఆఫీస్ అసిస్టెంట్ అండ్ కంప్యూటర్ ఆపరేటర్, కారు, ద్విచక్రవాహన మెకానిజంలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని వన్‌టౌన్ శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్‌ను సీపీ శంఖబ్రత బాగ్చీ శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించారు. స్టేషన్ పరిధిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేసుల రికార్డులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు.



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

నిబంధనలు తప్పనిసరి

గురుద్వారా, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించి దుర్గాదేవి నవరాత్రి జరుపుకోవాలని ద్వారకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.వి.రమణ సూచించారు. శనివారం ఉదయం స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అమ్మవారి అనుపులో బాణాసంచా, డీజే సౌండ్స్ పెట్టి పెద్ద పెద్ద శబ్దాలు చేయరాదని సూచించారు. సమావేశంలో స్టేషన్ ఎస్.ఐలు, తదితరులు పాల్గొన్నారు.



నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ రమణ

అసంపూర్తి పనులతో ఇక్కట్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పోర్టు ప్రాంతంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో చేపట్టిన రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పోర్టు ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనులు గత రెండు నెలల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రైల్వేట్రాక్‌ను ఆనుకొని జరుగుతున్న ఈ పనుల కారణంగా వేంకటేశ్వస్వామి ఆలయం, సాగరదుర్గ ఆలయాలకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దసరా పర్వదినం నేపథ్యంలో సాగరదుర్గ ఆలయ సందర్శనకు పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారని, ఇప్పటికైనా పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పోర్టు ప్రాంతంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అసంపూర్తిగా నిలిచిన రహదారి

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

కార్మిక సేవలకు సత్కారం



అగనంపూడి, న్యూస్‌టుడే : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో మెరుగైన విధులు అందించిన పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. శనివారం లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని... కార్మికుల్ని సత్కరించారు. వార్డు పారిశుద్ధ్య ఏఈ కోటేశ్వరరావు, కార్యదర్శులు కనకేశ్వరరావు, గంగునాయుడు, వెంకటేష్, తెదేపా నాయకులు సింగిడి సింహాచలం, యర్రా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : మహిళలు సొంత కాళ్లపై నిలబడానికి స్వయం ఉపాధి పథకాలు దోహదపడతాయని గాజువాక సమతా రోటరీ క్లబ్ అధ్యక్షుడు సీరపు వాసు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.విక్టర్‌రాజు అన్నారు. శనివారం క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు, ఎంబ్రాయిడరీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. రోటరీ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మాజీ గవర్నర్ సుబ్బారావు, డాక్టర్ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన మహిళలు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: అగనంపూడి అన్నపూర్ణనగర్ ప్రధాన రహదారిలో ప్రైవేటు విద్యుత్తు స్తంభాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాం. వాటితో దారి మొత్తం ఇరుకుగా మారింది. –పోలరాజు, అన్నపూర్ణనగర్

సమాధానం: పట్టణ ప్రణాళిక సిబ్బందిని పంపి పరిశీలన చేయిస్తాం. –శేషాద్రి, జెడ్పీ

?: జాతీయ రహదారి అగనంపూడి టోల్‌ప్లాజా నుంచి కూర్మన్నపాలెం వచ్చే మార్గంలో వీధి దీపాలు వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. –నూకరాజు, కూర్మన్నపాలెం

✔: సిబ్బందిని పంపి పునరుద్ధరణ పనులు చేయిస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

భారం తగ్గించి.. ఉపశమనం కల్పించి..

'చెత్త పన్ను' రద్దు చేసిన కూటమి ప్రభుత్వం



పారిశుద్ధ్య విధుల్లో..

న్యూస్‌టుడే, గాజువాక

ఇంటింటా చెత్త సేకరణ పేరుతో గత వైకాపా ప్రభుత్వం ప్రజలపై మోపిన చెత్తపన్ను భారం నుంచి ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉపశమనం కలిగించింది. పన్ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడంతో గాజువాక, పశ్చిమం నియోజకవర్గాల్లో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వ పాలనలో ప్రతి నెలా జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మరీ పన్ను వసూలు చేసేవారు. ఎవరైనా చెల్లించకపోతే... వీధుల్లో ఉన్న చెత్తను తెచ్చి నేరుగా ఆయా ఇళ్ల ఎదుట కుమ్మరించి, పన్ను చెల్లింపునకు ఒత్తిడి చేసేవారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం సిబ్బంది తీరుతో దిగువస్థాయిలోనూ నివాసితులు తప్పని సరి పరిస్థితుల్లో చెత్తపన్ను చెల్లించేవారు. ప్రజల ఇబ్బందులను తొలగించేలా, గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

వసూలు పైనే ధ్యాస..: గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లోని సాధారణ కుటుంబాల నుంచి నెలకు రూ.120, దుకాణాల్లో నివాసాల నుంచి నెలకు రూ.60 వసూలు చేసేవారు. నాటి ప్రభుత్వం సిబ్బంది శుభ్రత పనుల చేయడం కన్నా, చెత్త పన్ను వసూలు పైనే ఎక్కువగా దృష్టి సారించడంతో కొన్ని కాలనీల్లో ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. పట్టణ నివాసిత సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్స్ రెసిడెంట్స్ సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు, నిరసనలు కొనసాగాయి. ఇప్పుడు చెత్తపన్ను భారం తగ్గడంతో పలువురు సంతోషిస్తున్నారు.



నాలుగేళ్లు భరించాం..: వైకాపా ప్రభుత్వం పాలనలో నాలుగేళ్ల పాటు చెత్త పన్ను భారం భరించాం. ఏదైనా కారణంతో ఒక్క నెల చెల్లించకపోయినా ఆలస్యమైతే... పారిశుద్ధ్య సిబ్బంది ఇష్టానుసారంగా మాట్లాడేవారు. వీధుల్లో చెత్త తీసుకొచ్చి ఇంటి ముందు వేసి ఇబ్బందులకు గురి చేసే వారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో... ఆయా బాధలన్నీ తప్పాయి. –సూరంపూడి రాంబాయి, వికాస్‌నగర్



నిర్ణయం ఫలించింది..: ఎప్పుడు చెత్త పన్ను నుంచి ఉపశమనం కలుగుతుందని ఎదురు చూశాం. ఇన్నాళ్లకు భారం లేకుండా చేశారు. గాజువాక పట్టణంలో వలసొచ్చిన కుటుంబాలే ఎక్కువ. అలాంటి వారు అద్దెఇళ్లలో ఉంటూ చెత్త పన్ను చెల్లించేందుకు ఇబ్బందులు పడేవారు. పన్ను రద్దు చేయాలని గతంలో పలుమార్లు జీవీఎంసీ ఉన్నతాధికారులకు విన్నవించినా... పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. –పొగిరి రామకృష్ణ, మెహర్‌నగర్

నడకమార్గాలు ఆక్రమించొద్దు : సీఐ

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక పట్టణంలో నడకమార్గాలు ఆక్రమించి, ప్రజలకు అసౌకర్యం కల్పించొద్దని ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సూచించారు. శనివారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గాజువాక ప్రధాన రహదారిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కొత్తగాజువాక నుంచి పాతగాజువాక కూడలి వరకు ఉన్న కాలిబాటల్లో దుకాణాలు తొలగించాలని సూచించారు. ఏసీపీ, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదని హార్బర్ జోన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన మల్కాపురం స్టేషన్ పరిధిలో పలుచోట్ల వాహనాలను తనిఖీ చేశారు. బైక్ నడిపే వ్యక్తితో పాటు, వెనుక కూర్చున్న వారు శిరస్త్రాణం ధరించాలన్నారు.



గాజువాక ర్యాలీలో సీఐ కోటేశ్వరరావు, జీవీఎంసీ ప్రణాళిక సిబ్బంది

సంక్షిప్త సమాచారం..

• దంత సంరక్షణపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 68వ వార్డు రామ్‌నగర్‌లో శనివారం గీతం దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన కార్పొరేటర్ జి. అనూష మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ దంత సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వార్డు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

• విద్యుత్తు కోత.. ఉక్కపోత..!

గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి పరిసర ప్రాంతాల్లో శనివారం అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇష్టానుసారంగా విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో ఉక్కపోతతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎల్లపువానిపాలెం, చంద్రనగర్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఎన్ఏడీకూడలిలో రాత్రి 7 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో విలువైన గృహోపకరణాలు, ఇతర విద్యుత్తు పరికరాలు మరమ్మతులకు గురయ్యాయని పలువురు గగ్గోలు పెట్టారు. జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్రకాలనీ, డీఏఆర్‌నగర్, కొత్తపాలెంలో శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యపై స్థానికులు శనివారం విద్యుత్తుశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా.. సిబ్బంది, అధికారులు అందుబాటులోకి రాలేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి... విద్యుత్తు సరఫరా సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల గుర్తింపు సంఘం నూతన ప్రతినిధుల ప్రమాణ స్వీకార వేడుక శనివారం గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో జరిగింది. జిల్లా కార్యదర్శి కె.రాములప్పడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐటీఐ ప్రిన్సిపల్ కె.ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ శ్రీనివాస్ మాట్లాడారు. ఐటీఐ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నూతన ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా యు.వి.శివకుమార్, పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎం.లతాదేవి, ఎంఎన్‌డీడీ వర్మ, సహాయ కార్యదర్శిగా కె.కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.తులసీరావు, పీవీడీ ప్రసాద్ ప్రమాణం చేశారు. మూడేళ్లపాటు కమిటీ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



ప్రమాణం చేస్తున్న సంఘం సభ్యులు

గాజువాక సినిమాలు

కన్య, శ్రీకన్య: **దేవర**, మోహినీ 70ఎంఎం: **కలి** లక్ష్మీకాంత్: **శ్వాగ్** , హెవెన్: **దక్షిణ**, మినీ మోహినీ, అరుణ, అన్నపూర్ణ: **జోకర్** మోహినీ: **మత్తు వదలరా–2**, లక్ష్మి: **సత్యం సుందరం**, విశేష్: **రామ్‌నగర్ బన్నీ**

సెయిల్‌లో విలీనమే పరిష్కారం



బీసీగేటు వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

అగనంపూడి, న్యూస్‌టుడే : ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం నిర్వహించే మానవహారాన్ని విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. శనివారం అగనంపూడి పరిధి శనివాడ వేపచెట్టు కూడలిలో ప్రచారం నిర్వహించారు. ఉక్కు కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు శీరంశెట్టి గోవిందరావు, అట్టా అప్పారావు, హరినాథ్, నర్శింగరావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయకపోతే పోరు తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు హెచ్చరించాయి. శనివారం స్టీల్‌ప్లాంట్ బీసీగేటు వద్ద నిర్వహించిన నిరసనలో పలువురు మాట్లాడారు. కేంద్రం నాన్చుడు ధోరణి వీడి, సెయిల్‌లో విలీనంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండు చేశారు. ఆదివారం నిర్వహించే మానవహారాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. అఖిలపక్ష నాయకులు అనిపెద్ది మసేన్‌రావు, బొడ్డు పైడిరాజు, జెర్రిపోతుల ముత్యాలు, దొమ్మేటి అప్పారావు, జి.గణపతిరెడ్డి, జి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



శనివాడ కూడలిలో ప్రచారం చేస్తూ..

సమస్యల పరిష్కారానికి డిమాండ్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ప్రభుత్వ పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి పోరుబాట కొనసాగిస్తామని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు స్పష్టం చేశారు. శనివారం పెదగంట్యాడ ఉక్కు సీడబ్ల్యూసీలో నిర్వహించిన సంఘం సమావేశంలో జిల్లా ప్రతినిధి కృష్ణారావుమాట్లాడారు. అర్హులైన పింఛనుదారులకు కనీస పింఛను రూ.9 వేలు చెల్లించాలన్నారు. మండల కమిటీ సభ్యుడు కణితి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు దీనబంధు, పెంటారావు, గురప్ప, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఒప్పంద కార్మికుల సంఘం (సిటూ) గౌరవ అధ్యక్షుడు వెంకటరెడ్డి అన్నారు. శనివారం 77వ వార్డు కేవిన్‌పాలెం, నమ్మిదొడ్డిలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఒప్పందం ప్రకారంగా వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యదర్శి గొలగాని అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో దారి దోపిడీ

ఉద్యోగినిని కత్తితో బెదిరించి నగదు కాజేసిన మహిళలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో పట్టపగలే దారి దోపిడీ జరిగింది. ఆటోలో వెళ్తున్న మహిళా ఉద్యోగినిని కత్తితో బెదిరించిన ఇద్దరు మహిళలు రూ.1.80 లక్షల నగదు ఎత్తుకుపోయారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. విశాఖ నగరంలోని కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్న చెక్కా సుధ సీలేరులోని ఏపీ జెన్‌కోలో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఈమె ఆర్టీసీ బస్సులో సీలేరు నుంచి అనకాపల్లి వచ్చారు. ఇక్కడి నుంచి కూర్మన్నపాలెం వెళ్లడానికి ఆర్టీసీ కాంప్లెక్స్ బయట వేచి ఉన్నారు. ఇద్దరు మహిళలతో వచ్చిన ఆటోడ్రైవర్ గాజువాక వెళ్తున్నట్లు చెప్పడంతో సుధ ఆటో ఎక్కారు. జలగలమదుం జాతీయ రహదారి వద్ద ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు సుధను కత్తితో బెదిరించి ఆమె బ్యాగులో ఉన్న రూ. 1.80 లక్షల నగదు తీసుకుని ఆటో నుంచి బయటకు తోసేసి పరారయ్యారు. గాయపడిన సుధ వెంటనే భర్తకు ఫోన్ చేయడంతో గాజువాకలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. శనివారం అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సుధ జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తుంగ్లాంలో..



ఎల్‌వీనగర్‌లో..



చినగంట్యాడలో..



మెహర్‌నగర్‌లో..



అక్కిరెడ్డిపాలెంలో..



నాతయ్యపాలెంలో...



కైలాస్‌నగర్‌లో..



అగనంపూడిలో..



గోపాలపట్నంలో..



డ్రైవర్స్‌కాలనీలో..

త్రిశక్తి స్వరూపిణి.. అభయ ప్రదాయిని..!

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం విశాఖ పశ్చిమం, గాజువాక పరిధిలోని వివిధ ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి... భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. వివిధ పార్టీల నాయకులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కొన్నిచోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

–న్యూస్‌టుడే, గాజువాక, విశాఖ పశ్చిమం బృందం



అగనంపూడిలో కోలాటం ప్రదర్శన



షిప్‌యార్డుకాలనీలో..



వాంబేకాలనీలో..



పవనపుత్రనగర్‌లో..



మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో..



బాలచెరువులో..



ములగాడ కాలనీలో...

వస్త్ర సంచుల వినియోగమే మేలు

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే : కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా ప్రతి ఒక్కరూ వస్త్ర సంచులనే వినియోగించాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు సూచించారు. శనివారం సంస్థ ఆధ్వర్యంలో 59వ వార్డు ములగాడ రైతుబజార్‌లో వినియోగదారులకు వస్త్ర సంచులు పంపిణీ చేశారు. అనంతరం ప్లాస్టిక్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక జనసేన నాయకుడు పుర్రి సురేష్, సంస్థ ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.



ములగాడ రైతుబజార్‌లో సంచులు పంపిణీ చేస్తున్న దృశ్యం

క్షయ నివారణపై అవగాహన



సేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గోపాలపట్నం ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రి క్షయ నివారణ విభాగం ఆధ్వర్యంలో శనివారం 91వ వార్డు పాతగోపాలపట్నం సామాజిక భవనంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. క్షయ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించి, నివారణ చర్యలు సూచించారు. అనంతరం వ్యాధి నిర్ధారణకు పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. విభాగం సూపర్‌వైజర్ వి.శ్రీనివాసరావు, ల్యాబ్ సూపర్‌వైజర్ జి.వెంకటరమణ, హెల్త్ విజిటర్ జి.కరుణ, కె.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత యువతికి ఆశ్రయం

ఎన్ఏడీకూడలి (బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : సింహాచలం (గోపాలపట్నం) రైల్వేస్టేషన్ పరిసరాల్లో సంచరిస్తున్న మతిస్థిమితం లేని ఓ యువతి(20)తో ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ఆకతాయిలను హెచ్చరించి, బాధితురాలిని 90వ వార్డు బుచ్చిరాజుపాలెం నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ ఎ.మమతకు అప్పగించారు. పురుషుల వసతి గృహం కావడంతో... ఆ యువతిని 'మన కుటుంబం హోమ్'కు తరలించి ఆశ్రయం కల్పించినట్లు శనివారం మమత తెలిపారు. బాధితురాలికి అవసరమైన చికిత్స అందించి, ఆమె కోలుకున్న తర్వాత వివరాలు ఆరా తీసి, కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.



యువతిని వసతి గృహానికి అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

వరద బాధితులకు చేయూత

గోపాలపట్నం(ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే : కష్టకాలంలో ఉన్న విజయవాడ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని జీవీఎంసీ 92వ వార్డు జనతా మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఎం.విమల అన్నారు. శనివారం వార్డు పరిధి జనతాకాలనీలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను కలెక్టర్‌కు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు కె.కె.లక్ష్మి, కె.శ్రీదేవి, బి.రమాకుమారి, డి.శివలక్ష్మి, బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కాలనీల్లో విరాళాలు సేకరిస్తున్న మహిళలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు డీఏఆర్‌నగర్‌లో సుమారు రూ.11.10 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వార్డు తెదేపా అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, తెదేపా నాయకులు డి.కాశీ, దాడి సురేశ్, చిన్ని, నాగు ప్రజా పనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో రూ.19.97 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేపట్టారు. కాలనీ సామాజిక భవనం నుంచి ఎయిర్‌పోర్టు అప్రోచ్ రోడ్డు వరకు ఉన్న విభాగినులకు, పిల్లల పార్కు చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి, మొక్కల సంరక్షణకు బోరు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



90వ వార్డులో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రమణ

రోడ్లపై పశువులు.. రాకపోకలకు అడ్డంకులు..!

ఫోకస్



పెదగంట్యాడలో..

నడి వీధుల్లో తిష్ఠ వేస్తున్న పశువులతో పాదచారులు, వాహన చోదకులు నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు. పెదగంట్యాడ ఉక్కు నిర్వాసిత కాలనీలు, పారిశ్రామిక ప్రాంతం యారాడ వెళ్లే మార్గంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. కొందరు యజమానులు తమ ఆవులు, గేదెలను రోజూ ఉదయం, సాయంత్రం రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఆ సమయంలో రాకపోకలు సాగించే కార్మికులు, దినసరి కూలీలు, ఇతర ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు... దారి మధ్యలో వాటిని దాటుకుని ముందుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేవారు. దారుల్లో తిష్ఠ వేసే పశువులను జీవీఎంసీ కొట్టాలకు తీసుకెళ్లి సంబంధిత యజమానులకు జరిమానాలు విధించేవారు. కొన్నాళ్లుగా సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో పశువుల బెడద ఎక్కువైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి... సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గాజువాక, మల్కాపురం



మల్కాపురం పోలీస్‌స్టేషన్ సమీప యారాడ మార్గంలో..

• వృత్తి విద్యతో ముందడుగు

గాజువాక, న్యూస్‌టుడే : వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని జిల్లా గర్ల్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ కలీషా బేగం అన్నారు. శనివారం గాజువాక హైస్కూల్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌నకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు చదువుతో పాటు వృత్తి విద్యపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సంస్థ కో-ఆర్డినేటర్ సుధాకర్, వృత్తి విద్య శిక్షకురాలు కందుల భారతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

ఉక్కునగరం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: కూర్మన్నపాలెం సమీప తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నామని సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక నివాసి జి.శాంతారావు రూ.5 వేలతో కొనుగోలు చేసిన మొక్కల్ని కాలనీ పరిసరాల్లో నాటారు. శాంతారావు కుటుంబీకులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.